

జగన్ ఇచ్చిన హామీలను వీడియో క్లిప్పింగ్‌లను చూపిస్తున్న చంద్రబాబు



ప్రభంజనం

'రా కదలిరా!' సభ విజయవంతం



- తండోపతండాలుగా సభకు వచ్చిన పసుపు సైన్యం
- భారీ సంఖ్యలో తరలివచ్చిన మహిళలు, యువకులు
- జయజయ ధ్వానాలు, ఈలలు, కేరింతల హోరు
- స్ఫూర్తి నింపిన చంద్రబాబు ప్రసంగం
- ఆంబోతుకు కళ్లె వేసి నడిరోడ్డుపై నడిపిస్తా!
- పొన్నూరు 'కిలాడి' గ్రావెల్ రోశయ్యగా మారిపోయాడు
- ఆర్కే, మద్దాళిని వాడి పడేసిన పేపర్లా విసిరేశాడు
- స్థానిక వైసీపీ ఎమ్మెల్యేలపై విరుచుకుపడిన చంద్రబాబు

జనం.. జనం.. ఎటుచూసినా ప్రభంజనం.. తండోపతండాలుగా కదలివచ్చిన పసుపు సైన్యం.. సొంతవాహనాలపై స్వచ్ఛందంగా తరలి వచ్చిన ప్రజానీకం.. ఉత్సాహం నింపిన అధినేత ప్రసంగం.. జిల్లాలో 'రా కదలిరా!' సభ ప్రభంజనం సృష్టించింది. ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకపోయినా, రవాణా సదుపాయాలు సరిపోకపోయినా జనం గ్రామాల నుంచి లక్షలాదిగా తరలివచ్చారు. బైకు ర్యాలీలు పెట్టుకుని కొందరు, ట్రాక్టర్లు కట్టుకుని మరికొందరు సభకు హాజరయ్యారు. టీడీపీ సభలకు సంప్రదాయకంగా వచ్చే పార్టీ శ్రేణులు, రైతులతోపాటు ఈసారి పెద్దసంఖ్యలో మహిళలు, యువకులు హాజరయ్యారు. హాజరవడమే కాకుండా మహిళలు స్ఫూర్తిదాయకంగా చంద్రబాబు ఉపన్యాసానికి బదులిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనపై చంద్రబాబు మాట్లాడుతున్నప్పుడు ధీటుగా బదులిస్తూ, సైకో పాలన అంతం చేస్తామంటూ పిడికిళ్లు బిగించి నినాదాలు చేశారు. వేలాదిగా వచ్చిన యువత కట్టుతప్పకుండా క్రమశిక్షణగా సభను నడిపించడమే కాకుండా చంద్రబాబుకు భరోసాను ఇచ్చారు. సభలో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

గుంటూరు, పొన్నూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గంలోని వడ్లమూడి గ్రామంలో సోమవారం జరిగిన 'రా కదలిరా!' సభ విజయవంతమైంది. టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు సహా సాధారణ ప్రజలు కూడా తండోపతండాలుగా సభకు రావడంతో సభా ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. గ్యాలరీలన్నీ నిండిపోయాయి. మధ్యాహ్నం మూడు దాటిందో లేదో వేలాదిగా జనం సభకు తరలివచ్చారు. గుంటూరు పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల నుంచి వేలాది బైకులతో కార్యకర్తలు తరలిరాగా, సంప్రదాయకంగా వచ్చే రైతాంగం, రైతుకూలీలు ట్రాక్టర్లు కట్టుకుని సభకు చేరుకున్నారు. గుంటూరు, తెనాలి, పొన్నూరు పట్టణాల నుంచి అత్యధిక సంఖ్యలో సభికులు హాజరయ్యారు. సభ ప్రారంభానికి ముందే అందరూ ప్రాంగణానికి చేరుకోవడంతో గ్యాలరీలన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రాంగణం సరిపోక బయట రోడ్లపైన నిలబడే పరిస్థితి కనిపించింది. చంద్రబాబు రాకతో సభా ప్రాంగణమంతా జయజయ ధ్వానాలతో, ఈలలతో హోరెత్తింది. చంద్రబాబు వస్తున్న హెలికాప్టర్‌ను చూస్తూ మహిళలు, యువకులు, కార్యకర్తలు పచ్చ కండువాలు, జెండాలు ఊపుతూ అధినేతకు ఘన స్వాగతం పలికారు. ముఖ్యనేతలు హెలిప్యాడ్ వద్దకు వెళ్లి ఆయనను సాదరంగా వేదిక వద్దకు తీసుకువచ్చారు. సభకు టీడీపీ- జనసేన పార్టీల క్యాడర్ పెద్ద సంఖ్యలో హాజరవడంతో ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది.

ఉత్సాహం నింపిన చంద్రబాబు ప్రసంగం..

'మా కన్నాపై దాడి చేయిస్తావా ఆంబోతు.. ఖబడ్దార్! తోక కట్‌చేస్తా! ఆంబోతుకు కళ్లెం వేస్తా.. నడిరోడ్డుపై నడిపిస్తా.. అవసరమైతే బట్టలిప్పి తరిమికొడతా!' అంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విరుచుకుపడ్డారు. చంద్రబాబు అధికార వైసీపీ నేతల అరాచకాలపై చంద్ర నిప్పులు చెరిగారు. గుంటూరు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో వున్న అధికార పార్టీ ఎమ్మెల్యేల అక్రమాలను, అకృత్యాలను లక్షలాదిమంది ప్రజల సమక్షంలో ఎండగట్టడమే కాకుండా, అధికార మదంతో చెలరేగిపోతున్న వారికి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ముఖ్యమంత్రి వారికి అక్రమాలు చేయడానికి లైసెన్సులు ఇచ్చాడని ఆరోపించారు. ఒక పెద్ద సైకో ఇప్పుడు ఊరికో సైకోని సిద్ధం చేశాడని, వారందరికీ కళ్లెం వేసి దారికి తెచ్చే బాధ్యత టీడీపీ తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. 'పొన్నూరు కిలాడి' ఇప్పుడు గ్రావెల్ రోశ య్యగా మారిపోయాడని, సినిమాల్లో కనిపించే కేజీఎఫ్‌ను మించి పొన్నూరు గ్రావెల్ ఫీల్డ్(పీజీఎఫ్) దోపిడీ సాగుతోందని ఆరోపించారు. 700 ఎకరాల్లో 2వేల కోట్ల రూపాయల దోపిడీకి తెరతీశాడని ఆరోపించారు. మాజీ హోంమంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సుచరిత, వేమూరు ఎమ్మెల్యే, మంత్రి మేరుగ నాగార్జున, చిలకలూరిపేట ఎమ్మెల్యే, మంత్రి విడుదల రజినీపై సెటైర్లు వేశారు. ఈ ఊరిలో పనికిరాని చెత్త పక్కూరిలో బంగారమవుతుందని జగన్ అనుకుంటున్నారని, ఆ పప్పులేవీ ఉడకవని ఎద్దేవా చేశారు. 'పాపం మంగళగిరి ఎమ్మెల్యే మనపై కేసులు వేసీ వేసీ.. చివరికి జగన్ చేతిలో మోసపోయాడు' అని అన్నారు. గుంటూరు పశ్చిమలో మన పార్టీలో గెలిచిన ఎమ్మెల్యే ప్లేటు ఫిరాయించి ఇప్పుడు అడ్రసు లేకుండా పోయాడన్నారు. వాడుకుని వదిలేయడంలో జగన్ మించినవారు లేరని మరోమారు జగన్ రుజువు చేశాడు. వాళ్లిద్దరినీ వాడుకుని వేస్టు పేపర్‌లా వదిలేశాడని, వారు అడ్రస్ లేక తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. తెనాలిలో ఎమ్మెల్యే మున్సిపల్ సిబ్బందితో సొంత పనులు చేయించుకుంటున్నాడని, మట్టి, కంకర బొక్కేస్తున్నాడని, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే గంజాయి, గుట్కా వ్యాపారాలతో యువత జీవితాలను నాశనం చేస్తు న్నారని, వీరంతా ఎన్నికల తరువాత తగిన



గీతాలు ఆలపిస్తున్న తెలుగు మహిళలు

మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

వైసీపీ అరాచకాలను ఎండగట్టిన టీడీపీ నేతలు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రశ్నించడానికి ముందుకు వచ్చిన పవన్ కల్యాణ్‌ను కలుపుకుని చంద్రబాబు 'రా కద లి రా!' పిలుపునిచ్చారని అన్నారు. ప్రతిపక్షాలు ఏమి చేస్తున్నాయి. అధికార పక్షం ఏం చేస్తోంది అనేది ఆలోచించుకుని ప్రజలు ఓట్లేయాలని కోరారు. పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ మాట్లాడుతూ టీడీపీతో తన కుటుంబం 40 ఏళ్ల అను బంధం కలిగి వుందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి చనిపోయే వరకూ తన తండ్రి వీరయ్య చౌదరి పార్టీ సేవకే అంకితమ య్యారని, తాను కూడా కడదాకా పార్టీతోనే వుంటానని చెప్పారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రం కోస మే పవన్ మంచి నిర్ణయం తీసుకున్నారని, ఓటు ను చీలనివ్వకుండా వైసీపీని ఓడించడానికి చంద్రబాబు, పవన్ కలిసి నడుస్తున్నారని, ప్రతిపక్ష ఓటును చీలనీయనన్న పవన్ లక్ష్యాన్ని దెబ్బతీయడానికే కాంగ్రెస్, షర్మిల నాటకమని విమర్శించారు. పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ ప్రజలంతా ఎన్నికల కోసం కాకుండా స్వాతంత్ర్యం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు ఇన్ చార్జి బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ రైతలును, రైతుకూలీలు, దిన కూలీలను, మహిళలు, యువత, ఉద్యోగులు, విద్యార్థులు అందరినీ వంచించిన జగన్‌కు ప్రజల్లో మార్పు చూసి వెన్నులో వణుకు పుడుతుందన్నారు. తూర్పు ఇన్‌చార్జి నసీర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ నాడు ఇచ్చిన పిలుపు స్ఫూర్తినందుకుని జనం కదలినట్లు ఇప్పుడు బాబు స్ఫూర్తినందుకుని జనం రాష్ట్రం కోసం, పిల్లల భవిష్యత్తు కోసం కదలిరావాలన్నారు. మంగళగిరి నుంచి రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలను క్షోభ పెడుతోంది జగన్‌రెడ్డే నన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజా మాట్లాడుతూ ఉద్యమాల పురుటిగడ్డలో రాజధానిని ఏర్పాటు చేస్తే దానిని జగన్‌రెడ్డి విచ్ఛిన్నం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు అభివృద్ధితో దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేశారన్నారు. కార్యక్రమంలో రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్, మాజీ మంత్రులు కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబు, దేవినేని ఉమా మహేశ్వరరావు, నన్నపనేని రాజకుమారి, మాకినేని పెదరత్తయ్య, రాయపాటి శ్రీనివాస్, నేతలు డేగల ప్రభాకర్, కనపర్తి శ్రీనివాసరావు, మన్నవ మోహనకృష్ణ, నిమ్మల శేషయ్య, చిట్టాబత్తిన చిట్టిబాబు, వడ్రాణం మార్కండేయులు, హరిబాబు, నందం అబద్ధయ్య, పాల్గొన్నారు.



చంద్రబాబుతో ఎమ్మెల్యే అనగాని మాటామంతి



ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేంద్రకుమార్



చంద్రబాబును సన్మానిస్తున్న జనసేన నేతలు



సభలో ముస్లిం మహిళలు

నాలా మోసపోవద్దు..

- వైసీపీ నాయకుడు అబ్దుల్లా వినతి

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జనవరి29: తనలా వైసీపీకి ఓటు వేసి నష్టపోవద్దని వైసీపీ నాయకుడు షేక్ అబ్దుల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. వడ్లమూడిలో జరిగిన



రా కదలిరా టీడీపీ బహిరంగ సభలో ఆయనకు మాట్లాడే అవకాశం కల్పించగా తన కుటుంబం గత ఎన్నికల్లో కష్టపడి పనిచేసి వైసీపీని గెలిపించామని అన్నారు. నాలుగేళ్ల క్రితం తన కుమారుడు రబ్బానీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నాడు. తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉండటంతో ముఖ్యమంత్రికి, డీజీపీకి లేఖలు రాసినా తన గోడు వినేవారే లేరన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే వద్దకు వెళ్లి కుమారుడి మృతిపై విచారణ జరపాలని పలుమార్లు కోరినా నిర్లక్ష్యమే కనపడిందన్నారు. డబ్బులు తీసుకొని తన కుమారుడి కేసును ఎమ్మెల్యే మాఫీ చేయించారని తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ప్రజలకు రక్షణ ఇచ్చే టీడీపీ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

సభకు వచ్చిన వాహనాలపై రవాణా శాఖ పెనాల్టీ

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జనవరి29: చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామంలో సోమవారం జరిగిన తెలుగుదేశం పార్టీ రా కదలిరా బహిరంగ సభకు వచ్చిన వాహనాలపై రవాణా శాఖ పెనాల్టీలు విధించటం ఆశ్చర్యానికి గురి చేసింది. వడ్లమూడి గ్రామం వద్ద జరిగిన సభకు ప్రజలు పలు జిల్లా నలుమూలల నుంచి బస్సులు, ట్రాక్టర్లు, కారులు, ఇతర రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేసుకొని స్వచ్ఛందంగా తరలివచ్చారు. ప్రభుత్వ ఆదేశాలా లేక, వైసీపీ పెద్దలు హుకుం జారీ చేసారో తెలియదు కానీ రవాణా శాఖ అధికారులు, ఈ ప్రైవేటు ఆపరేటర్ల బస్సులను ఆపి భారీ పెనాల్టీ విధించిన్నట్లు సమాచారం. అంతే కాకుండా మార్గంలో లారీలను అడ్డుపెట్టి వాహనాలు అడ్డగించారు. రవాణా శాఖ అధికారులు, పోలీసుల చర్యలతో టీడీపీ శ్రేణులు రోడ్డు పైనే వాహనాలను నిలిపి నిరసనలు వ్యక్తం చేశారు.



కటౌట్‌లు, ఫ్లడ్‌లైట్లు స్టాండ్‌లు ఎక్కిన కార్యకర్తలు



మహిళాభిమానం

అక్రమ మైనింగ్‌పై.. కన్నెర్ర !

- రూ.12 కోట్ల అపరాధ రుసుం విధింపు



దాచేపల్లిలోని క్వారీలలోఎక్స్‌కవేటర్‌తో మైనింగ్ జరుగుతున్న దృశ్యం

దాచేపల్లి, జనవరి 29: దాచేపల్లిలోని క్వారీలో అధికారులు తనిఖీలు నిర్వహించి రూ.12 కోట్ల అపరాధ రుసుం విధించారు. వివరాల్లోకి వెళితే.. దాచేపల్లి భూగర్భగనుల శాఖ పరిధిలో పిడుగురాళ్ల, దాచేపల్లి, మాచవరం మండలాల్లో తెల్లరాయి భూగర్భగనులు విస్తారంగా వున్నాయి. దాచేపల్లిలో 28, పిడుగురాళ్లలో 37, మాచవరంలో 4 అనుమతి పొందిన క్వారీలు వున్నాయి. సుమారు 100 హెక్టార్లలో మైనింగ్ క్వారీకి అనుమతులు వున్నాయి. ఇవి కాకుండా అనుమతులు లేకున్నా కూడా మరిన్ని క్వారీలు జరుగుతున్నాయని ఆరోపణలు వున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా మిషనరీలతో క్వారీయింగ్ జరుగుతుంది. ప్రధానంగా దాచేపల్లి, నారాయణపురం, కేశానుపల్లి, నడికూడి, గామాలపాడు, తంగెడ గ్రామాలలో క్వారీలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా నడికూడి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో కూడా అనుమతి లేని క్వారీల నుంచి రాయి తరలిస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. పిడుగురాళ్ల, కోనంకి గ్రామాలలో కూడా అధికారులు అక్రమమైనింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. ఈ క్రమంలో కేశానుపల్లి గ్రామంలో క్వారీకి రూ.12 కోట్లకు పైగా అపరాధ రుసుం అధికారులు విధించారు. నారాయణపురంలో మరో క్వారీకి కోటి రూపాయలకు పైగా అపరాధ రుసుం విదించినట్లు సమాచారం. కొన్ని క్వారీలకు బ్లాస్టింగ్ అనుమతి లేకున్నా బ్లాస్టింగ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

మైనింగ్ ఏడీఈ వివరణ...

అక్రమ మైనింగ్ క్వారీలపై దాచేపల్లి భూగర్భగనుల శాఖ ఏడీఈ అశోక్‌కుమార్‌ను వివరణ కోరగా, తమదృష్టికి వచ్చిన క్వారీలపై తనిఖీలు చేయడం, అపరాధ రుసుం విధించడం జరిగిందన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని, మా దృష్టికి వచ్చినా ఎవరైనా సమాచారం ఇచ్చినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అక్కడా.. ఇక్కడా.. ఓటు

- పట్టణంలోని వివిధ వార్డుల్లో వెలుగుచూస్తున్న డబుల్ ఓట్లు
- నరసరావుపేటలో నివాసం ఉంటూ వినుకొండలో ఓటు

వినుకొండటౌన్, జనవరి 29 : వినుకొండ పట్టణంలోని పలు వార్డుల్లో డబుల్ ఓట్లు వెలుగుచూస్తున్నాయి. ఒకే ఫొటోను పలు విధాలుగా మార్పులు చేసి రెండు ఓట్లు కలిగి ఉంటున్నాయి. 194వ బూత్‌లో సీరియల్ నంబరు 483, ఇంటి నంబరు 23-440, సీ.నెం. 482, ఇంటి.నెం.23-440 ఫొటో చిన్నపాటి మార్పులతో షేక్ హుస్సేన్‌బీ డబుల్ ఓట్లు కలిగి ఉంది. అదేవిధంగా 180వ బూత్ నంబరులో పందుల నవీన ఇంటినెం.16, సీ.నెం.231లో ఒక ఓటు, ఇంటి నెం. 23-249తో సీ.నెం. 12లో 207వ బూత్‌లో మరొక ఓటు కలిగి ఉంది. 193వ బూత్‌లో లక్ష్మీ విజయ బీమ్ ఇంటినెం.15-57, సీ.నెం. 15, 195వ బూత్‌లో ఇంటినెం. 14-78/1, సీ.నెం. 698 రెండు ఓట్లు కలిగి ఉంది. 194వ బూత్‌లో షేక్ మస్తాన్‌వలి ఇంటినెం.23-440, సీ.నెం.486 ఒక ఓటు, అదే బూత్‌లో ఇంటినెం.23-440, సీ.నెం. 485 మరొక ఓటు కలిగి ఉన్నారు. 213 బూత్‌లో ఇంటినెం.19-65, సీ.నెం.337లో ఒక ఓటు, 183వ బూత్‌లో ఇంటినెం.4-22-ఎ, సీ.నెం.474లో షేక్‌కరీమూన్ రెండు ఓట్లు కలిగి ఉన్నారు. ఇదిలా ఉండగా 194వ బూత్‌లో మేడా నాగాంజికి ఇంటి.నెం.19-243, సీ.నెం.141, అదే బూత్‌లో 19-249 ఇంటి నంబరుతో సీ.నెం.142తో మరొక ఓటు కలిగి ఉన్నాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి వార్డులో బూత్‌లో సుమారు 100కు పైగా దొంగ ఓట్లు చేర్పుకున్నట్లు ప్రతిపక్షపార్టీలకు చెందిన నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నరసరావుపేటలో నివాసం ఉంటూ వినుకొండలో ఓటు కలిగిన వారి వివరాలు పరిశీలిస్తే... రామావత్ నానిక్యానాయక్‌కు 2వ బూత్‌లో 419 నంబరులో ఓటు, నరసరావుపేటలో 116వ బూత్‌లో 247 సీ.నెం.తో మరొక ఓటు, మీనిగ రమాదేవికి 29వ బూత్‌లో 470 సీ.నెం.తో ఒక ఓటు, నరసరావుపేటలో 174వ బూత్‌లో 176 సీ.నెం.తో ఓటు, షేక్ జానీబాషా 39వ బూత్‌లో వెయ్యి సీరియల్ నంబరులో ఒక ఓటు, నరసరావుపేటలో 292 సీ.నెం మరొక ఓటు, షేక్ వలి వినుకొండ పట్టణంలో 39వ బూత్‌లో 999 సీ.నెం., నరసరావుపేటలో 163వ బూత్‌లో 396 సీ.నెం., షేక్ సైదా వినుకొండలో 153వ బూత్‌లో, 114వ సీ.నెం., నరసరావుపేటలో 107వ బూత్‌లో 770 సీ.నెం.లో ఓట్లు ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే నరసరావుపేటలో నివాసం ఉంటూ వినుకొండలో ఓటు కలిగిన వారు సుమారు 53 డబుల్ ఓట్లను కలిగి ఉన్నారు. వినుకొండకు సరిహద్దు నియోజకవర్గాలైన దర్శి, నరసరావుపేట, మాచర్ల, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో నివాసం ఉంటున్న వారికి వినుకొండలో పలు వార్డుల్లో ఓట్లు వెలుగుచూడటంపై పలు అనుమానాలకు తావిస్తుంది. నిష్పక్షపాతంగా విచారణ జరిపి డబుల్ ఓట్లు తొలగించామన్న అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని ప్రతిపక్ష పార్టీల నాయకులు అంటున్నారు.



వివిధ వార్డుల్లో డబుల్ ఓట్లు కలిగిన వ్యక్తుల పేర్లు

అసమానతలకు అద్దం పట్టిన ఆక్స్‌ఫామ్ నివేదిక

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి తరువాయి)

పన్నుల నుంచి తప్పించుకొనుట

● ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో ఆపరేటివ్ అండ్ డెవలప్‌మెంట్(ఓఈసీడీ) వంటి వాటిలో ఉన్న అనేక దేశాలు 80వ దశకం నుంచి కార్పొరేట్ ట్యాక్స్‌లను సగానికి పైగా తగ్గిస్తూ వచ్చాయి. ప్రపంచీకరణ యుగంలో పెట్టుబడుల ఆకర్షణ కోసం కొన్ని దేశాలు అతి తక్కువ కార్పొరేట్ పన్నులు విధిస్తున్నాయి. మరి కొన్ని దేశాలు ట్యాక్స్ హెవెన్స్‌గా మారాయి. దీని వల్ల పలు దేశాలకు పన్ను రాబడి తగ్గింది. అంతేకాదు, పన్నులు విధిస్తున్న దేశాల్లోని సంపన్నులు పన్నుల ఎగవేతకు పాల్పడడానికి డొల్ల కంపెనీల స్థాపనకు కారణమవుతున్నాయి.

● 1980లో ఓఈసీడీ దేశాల్లో కార్పొరేట్ ఆదాయ పన్ను 48 శాతం ఉండగా 2022 నాటికి అది 23 శాతానికి తగ్గింది. 2020-23 మధ్య కాలంలో 141 దేశాల్లో సర్వే చేయగా 111 దేశాల్లో ఇదే ధోరణి కనిపించింది. ఇదే సమయంలో కార్పొరేట్ల ఆదాయం కొన్ని రెట్లు పెరిగింది. ఈవిధంగా సంపన్నులపై పడని పన్నుల భారం ప్రభుత్వ సంక్షేమ వ్యయాల కోసం సామాన్యులు, పేదలపై పడుతూ ప్రపంచ వ్యాప్తంగా వారి వాస్తవ ఆదాయాలను మరింత తగ్గిస్తోంది.

ప్రభుత్వ రంగ వ్యవస్థల ప్రైవేటీకరణ

● అసమానతలను తగ్గించేందుకు ప్రభుత్వ రంగంలో ఉండాల్సిన విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల్లోకి ప్రైవేట్ రంగాన్ని అనుమతించడంతో వాటిని సైతం కార్పొరేట్స్ లాభార్జన కోసం వినియోగించుకుంటున్నాయి. ప్రపంచ బ్యాంక్ వంటి నిధి వితరణ సంస్థలు కూడా ప్రైవేట్ భాగస్వామ్య పథకాలకు రుణాలు మంజూరు చేస్తూండడంతో పెద్ద ఎత్తున ప్రజాధనం కార్పొరేట్ సంస్థల పెట్టుబడిగా పరిణమిస్తోంది.

● విద్య వంటి ప్రజాశ్రేయస్సు రంగంలో కూడా కార్పొరేట్ ప్రవేశంతో ఆ సేవలు పొందలేని పేదలకు, వాటిని పొందే ధనికులకు మధ్య నైపుణ్యాలు, విద్యా ప్రమాణ పరమైన అంతరాలు మరింత పెరిగి ఆర్థిక అసమానతలను సుస్థిరం చేస్తున్నాయి.

వాతావరణ విఘాతం

● ప్రపంచ కుబేరుల అధీనంలోని అనేక సంస్థలు శిలాజ ఇంధనాలు, ప్రకృతి వనరులను విచక్షణారహితంగా వాడడం వల్ల కర్బన ఉద్గారాలు ఎత్తున విడుదలై పర్యావరణ హననానికి కారణమవుతున్నాయి.

● ప్రపంచ జనాభాలో 2/3 వ వంతు పేదలు విడుదల చేస్తున్న కాలుష్యానికి సమానమైనదాన్ని కేవలం ఒక శాతం ఉన్న సంపన్నులు విడిచి పెడుతున్నారు

సూచించిన పరిష్కారాలు

● ప్రపంచ దేశాల మధ్య ఆదాయ అసమానతల నివారణకు ఐక్యరాజ్యసమితి, జీ 20 వంటి వేదికల ద్వారా గ్లోబల్ రూల్స్-విధానాల రూపకల్పనకు కృషి జరగాలి.

● కార్పొరేట్ శక్తులకు దీటుగా ప్రభుత్వ రంగం విద్య, వైద్యం, మౌలిక సేవల రంగాల్లో పునరుత్తేజం తేవాలి.

● ప్రజా రవాణా, పునరుత్పాదక శక్తి వనరులు, రుణ వితరణ రంగాల్లో కార్పొరేట్ నియంత్రణ శక్తులకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం అందుబాటులో ఉండాలి. మార్కెట్ నియంత్రణ, ధరల నియంత్రణకు ప్రభుత్వ వ్యవస్థల పాత్ర, పరిధి పెరగాలి.

● ప్రభుత్వ రంగ సంస్థల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచాలి.

● పేటెంట్ రూల్స్‌ను సరళీకరించి గుత్తాధిపత్య ధోరణుల స్థానంలో ప్రజాస్వామ్యయుత ఉద్యమతత్వం, వాణిజ్యం పాదుకొల్పాలి.



● కార్మికుల, మహిళల, అణగారిన వర్గాల సాధికారతకు; పర్యావరణ పరిరక్షణకు; అసమానతల నిర్మూలనకు కార్పొరేట్ సెక్టార్ దోహదపడేలా ప్రభుత్వ చర్యలు ఉండాలి.

● ట్రేడ్ యూనియన్ల ఏర్పాటు, పర్యావరణ డ్యూ డెలిజెన్స్, మానవ హక్కుల అమలు దిశగా ప్రభుత్వాలు చట్టాలను, విధానాలను రూపొందించాలి.

● సీఈఓ, యాజమాన్య లాభాలు, ప్రతిఫలాలపై క్యాపింగ్ విధించడం; కార్పొరేట్ ఆదాయ పన్ను పెంచడం, పర్మనెంట్ యాక్సెస్ ప్రాఫిట్ ట్యాక్స్, పర్మనెంట్ వెల్త్ ట్యాక్స్ విధించడం వంటి చర్యలు చేపట్టాలి.

● ప్రజలలో ఉద్యమతత్వం పెంచడం, సహకార సంఘాల ఏర్పాటు, చిన్న సంస్థలకు రుణ వితరణ పెంచడం, లాభాల్లో ఉద్యోగులకు వాటాలనిచ్చే న్యూ జనరేటివ్ కంపెనీల ప్రోత్సాహం, కనీసం జీవన వేతనాలను ఇచ్చే సంస్థలకే ప్రభుత్వ కాంట్రాక్ట్‌లు ఇవ్వడం, అంతర్జాతీయ ద్రవ్య సంస్థల నిధులు వెచ్చించే ప్రాజెక్టుల్లో బహుళ జాతి కంపెనీలు చొరబడకుండా చూడడం, పన్నులు సక్రమంగా చెల్లించే సంస్థలకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడం వంటి చర్యల ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు దోహదపడవచ్చు.

ఆక్స్‌ఫామ్ ఇండియా రిపోర్ట్: సర్వైవల్ ఆఫ్ ద రిచ్చెస్ట్-ద ఇండియా స్టోరీ'

భారతీయ ఆర్థిక అసమానతలపై ఆక్స్‌ఫామ్ ఇండియా విడుదల చేసిన నివేదిక- లింగ, వర్గ, ప్రాంతాలపరంగా పేద-ధనిక వ్యత్యాసాలను విశ్లేషించింది. అసమానతల్లో ఇటీవలి ధోరణులు, వాటికి కారణాలు, నివారణ చర్యలు కూడా పేర్కొంది.

భారత్‌లో ఆర్థిక అసమానతల తీరు

● దేశ సంపదలో 60 శాతం వరకు కేవలం అయిదు శాతం మంది సంపన్నుల చేతిలో కేంద్రీకృతం కాగా ఆర్థికంగా దిగువన ఉన్న 50 శాతం మంది చేతిలో 3 శాతం సంపద మాత్రమే ఉంది.

● 2020-22 మధ్య రెండేళ్లలో భారత బిలియనీర్ల సంఖ్య 102 నుంచి 166కు పెరిగింది. ఇదే సమయంలో ప్రపంచంలోనే అత్యధికమంది(228.9 మిలియన్లు) పేదలు భారతదేశంలో ఉన్నారు.

● 2012 నుంచి 2023 మధ్య కాలంలో భారతదేశంలో సృష్టించిన సంపదలో 40 శాతం దేశంలోని ఒక శాతం సంపన్నుల చేతుల్లోకి చేరగా కేవలం 3 శాతం సంపద ఆర్థికంగా దిగువన ఉన్న 50 శాతం మంది జనాభా చేతుల్లోకి చేరింది.

● దేశంలోని వందమంది అత్యంత సంపన్నుల సంపద విస్తృతంగా 660 బిలియన్ డాలర్లు/54.12 లక్షల కోట్లుగా ఉంది. ఇది ఏడాది కాలానికి సరిపోయే దేశ బడ్జెట్ నిధులకు సమానం.

● భారతదేశంలో 2018 నుంచి 2022 మధ్య పేదల సంఖ్య మాత్రం 190 మిలియన్‌ల నుంచి 350 మిలియన్‌లకు పెరిగింది. 2022లో అయిదేళ్లలోపు బాలల మరణాల్లో 65 శాతం కేవలం పేదరికం, పోషకాహార లోపం వల్ల సంభవించాయి.

● కరోనా విజృంభించిన సమయంలో దిగువ 50 శాతం మంది జనాభా తమ సంపదలో క్షీణతను చవిచూశారు. 2020 జాతీయాదాయంలో వారికి దక్కింది కేవలం 13 శాతం మాత్రమే. ఇది వారిపై రుణభారం పెరగడానికి, పోషకాహార లోపానికి, అనారోగ్య మరణాలకు దారితీసింది. ఇదే సమయంలో ఎగువ 30 శాతం మంది సంపన్నులు 90 శాతం సంపదను చేజిక్కించుకున్నారు. మరీ ముఖ్యంగా ఎగువ 10 శాతం మంది సంపన్నుల చేతిలో 80 శాతం సంపద కేంద్రీకృతం కాగా ఎగువ 5 శాతం మంది సంపన్నుల చేతిలో అయితే దేశ సంపదలో సగానికిపైగా అంటే 62 శాతం వరకు వచ్చి చేరింది. ఇక టాప్ ఒక శాతం మంది సంపన్నుల చేతిలో కేంద్రీకృతమైన సంపదను దిగువ 50 శాతం మంది ప్రజల మొత్తం సంపదతో పోలిస్తే 13 రెట్లు ఎక్కువగా ఉంది. అంటే మొత్తం దేశ సంపదలో 40.6 శాతం వరకు కేవలం ఒక శాతం టాప్ సంపన్నుల చేతిలో ఉంది.

● ఈ ఆర్థిక అసమానతల ధోరణులు కరోనా సమయంలో మరింత పెరిగాయి. కరోనా విజృంభణ నుంచి 2022 నవంబరు వరకు బిలియనీర్ల సంపద 121 శాతం పెరిగింది. అంటే రోజుకు 3,608 కోట్ల రూపాయాల సంపద జమ అయింది.

లింగ, సామాజిక అసమానతలు

● భారతీయ పురుష కార్మికులు సంపాదించే ప్రతి రూపాయి వేతనానికి మహిళ కార్మికులు కేవలం 60 పైసలు మాత్రమే సంపాదిస్తున్నారు. ఈ వ్యత్యాసాలు గ్రామీణ, షెడ్యూల్డ్ క్యాస్ట్ వర్గాల్లో అధికంగా ఉన్నాయి. పట్టణ, ఉన్నత వర్గాలు పొందుతున్న ఆదాయాల్లో గ్రామీణులు 55 శాతం, షెడ్యూల్డ్ క్యాస్ట్‌ల వారు సగం కన్నా తక్కువే పొందుతున్నారు.

ఆర్థిక అసమానతలు పెరగడానికి కారణాలు

● భారతదేశంలో 2019లో కార్పొరేట్ పన్ను శ్లాబ్‌ను 30 శాతం నుంచి 22 శాతానికి తగ్గించారు. కొత్త పరిశ్రమలపై మరింత తక్కువగా 15 శాతం పన్ను విధించారు. ఈ కొత్త పన్ను విధానాల వల్ల దేశం 1.84 లక్షల కోట్ల రూపాయలు కోల్పోయింది. అయితే ఆదాయం పెంచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీని; పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీలను పెంచడం వల్ల ఈ పరోక్ష పన్నులు సామాన్యులపై ఆర్థిక భారాన్ని మోపాయి.

● ఆదాయంలో శాతంగా చూసుకుంటే భారతదేశంలో దిగువ 50 శాతం మంది ప్రజలు, టాప్ 10 శాతం మంది సంపన్నులతో పోలిస్తే ఆరు రెట్లు ఎక్కువ పన్ను చెల్లిస్తున్నారు.

● ఆహార, ఆహారేతర పదార్థాలపై విధించే పన్నుల్లో 64 శాతం వరకు దిగువ 50 శాతం జనాభా నుంచే సమకూరుతోంది.

● ప్రభుత్వానికి జీఎస్‌టీ ఆదాయాలపరంగా చూస్తే 2/3 వంతుకు కొద్దిగా తక్కువ భాగం దిగువ 50 శాతం మంది నుంచి; 1/3 శాతం వరకు మధ్య 40 శాతం జనాభా నుంచి సమకూరుతుండగా టాప్ 10 శాతం మంది నుంచి కేవలం మూడు శాతం నుంచి నాలుగు శాతం వరకు లభిస్తోంది.

● ఈ విధంగా సంపన్నుల సంపదపై కన్నా సామాన్య పేద వర్గాల ఆదాయాలపై పన్నులు అధికంగా ఉండి వారి తలసరి వ్యయార్హ ఆదాయం తగ్గి ఆదాయ అంతరాలు మరింత పెరుగుతున్నాయి.

● భారతదేశంలోని బిలియనీర్ల మొత్తం సంపదపై ఒకసారి రెండు శాతం పన్ను విధించినట్లయితే వచ్చే 40,423 కోట్లతో దేశంలోని పోషకాహార లోపంతో బాధపడుతున్న బాలలకు మూడేళ్ల పోషకాహారాన్ని అందించవచ్చు.

● అదేవిధంగా దేశంలో అత్యంత సంపన్న వ్యక్తి గౌతమ్ అదానీపై 2017-21 మధ్య అన్ రియలైజ్డ్ గెయిన్స్‌పై ఒకసారి పన్ను విధించడం ద్వారా వచ్చే 1.79 లక్షల కోట్లతో దేశంలోని 50 లక్షల ప్రైమరీ స్కూల్ టీచర్లకు ఏడాదిపాటు ఉపాధి, వేతనాలు ఇవ్వొచ్చు.

● టాప్ 10 బిలియనీర్లపై 5 శాతం చొప్పున పన్ను విధిస్తే షెడ్యూల్డ్ ట్రైబ్‌ల ఆరోగ్య సంరక్షణపై అయిదేళ్లకు ఖర్చయ్యే మొత్తం లభిస్తుంది.

భారత్‌లో అసమానతల నిర్మూలనకు ఇచ్చిన సూచనలు

● దేశంలోని సంపన్నుల నికర సంపదపై శాశ్వత ప్రాతిపదికన పన్నులు విధించాలి. విధాన రూపకర్తలను ప్రభావితం చేయగల సంపన్న వర్గాలు మరింత సంపన్నులుగా మారే విషవలయాన్ని ఛేదించాలి.

● సామాన్యులు వినియోగించే కనీసావసర వస్తువులపై జీఎస్‌టీ పన్ను స్లాబ్‌లను తగ్గించడం, విలాస వస్తువులపై భారీగా పన్నులు విధించడం ద్వారా పేదలపై పన్ను భారం తగ్గి ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

● వైద్య రంగంపై 2025 నాటికి జీడీపీలో 2.5 శాతం బడ్జెట్ కేటాయింపులు చేయాలి. అదేవిధంగా విద్యపై 6 శాతం కేటాయించాలి. విద్య-వైద్య సౌకర్యాలు విస్తరింపజేయాలి. పేద, అణగారిన వర్గాలు, మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలి.

● దేశంలోని అవ్యవస్థీకృత ఆర్థిక రంగంలో ఉన్న 90 శాతం శ్రామిక శక్తి ఆకస్మిక ఆర్థిక ఒడుదొడుకులను, ద్రవ్యోల్బణాలను తట్టుకొనే స్థితిలో లేనందున వారికి సాంఘిక భద్రత కల్పించడం సహా పర్యవేక్షణ, ట్రి కింగ్, పరిరక్షణ విధానాల ద్వారా వారిని ఆదుకోవాలి.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

దిక్సూచి DIKSUCHI

ఏపీ అంబేద్కర్ గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలు

తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డా.బీ.ఆర్.అంబేద్కర్ గురుకులాలు, ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024 ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. విద్యార్థులు సొంత జిల్లా గురుకులంలో ప్రవేశానికి మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. అభ్యర్థి కోరుకున్న గ్రూప్ అక్కడ లేని పక్షంలో సంబంధిత జోన్ పరిధిలోని మరో జిల్లా గురుకులానికి అప్లయ్ చేసుకోవచ్చు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరవాత మార్పులకు అవకాశం లేదు. ఎంపికైన అభ్యర్థులకు విద్య, వసతి ఉచితం. క్రీడలకు ప్రాధాన్యమిస్తారు.

సీట్లు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 164 గురుకులాల్లో ఎంపీసీ 5400, బైపీసీ 5400, ఎంఈసీ 800, సీఈసీ 1600, హెచ్‌ఈసీ 360 సీట్లు ఉన్నాయి.

● ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో మొత్తం 600 సీట్లు ఉన్నాయి. వీటిలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకు సమానంగా ఒక్కోదానిలో 300 సీట్లు కేటాయించారు. కృష్ణా జిల్లా-ఈడ్పుగల్లులోని బాలికల అకాడమీలో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లకు ఒక్కోదానిలో 160 సీట్లు ఉన్నాయి. కర్నూలు-చిన్నటేకూర్‌లోని బాలుర అకాడమీలో ఒక్కో గ్రూప్‌లో 60 సీట్లు, గుంటూరు-అడవితక్కెళ్లపాడు బాలుర అకాడమీలో ఒక్కో గ్రూప్‌లో 80 సీట్లు ఉన్నాయి.

అర్హత: ప్రస్తుతం పదోతరగతి పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలుగు మీడియంలో చదివినవారు కూడా అర్హులే. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించకూడదు. ఇప్పటికే ఈ గురుకులాలల్లో చదువుతున్నవారికి ఒక ఏడాది సడలింపు వర్తిస్తుంది. కుటుంబ వార్షిక ఆదాయం రూ.1,00,000 లోపు ఉండాలి.

ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన పదోతరగతి సిలబస్ ఆధారంగానే ఉంటాయి. మేథమెటిక్స్ నుంచి 25; ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్(కాంప్రహెన్షన్ అండ్ గ్రామర్), లాజికల్ రీజనింగ్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 15 ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. సమాధానం తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నలు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటాయి.


● ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024లో సాధించిన మెరిట్ ఆధారంగా ఐఐటీ - మెడికల్ అకాడమీల్లో ప్రవేశానికి షార్ట్‌లిస్ట్ రూపొందిస్తారు. వీరికి మాత్రమే మరో ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు.

- దరఖాస్తు ఫీజు లేదు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 23
- **ఏపీ బీఆర్ఏజీ ఇంటర్ సెట్ 2024 తేదీ:** మార్చి 10
- **ఐఐటీ-మెడికల్ అకాడమీల్లో ప్రవేశానికి టెస్ట్ తేదీ:** ఏప్రిల్ 21
- **వెబ్‌సైట్:** https://apbragcet.apcfss.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/Pb1Zvp3లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

మరో 200 రోజుల్లో...



అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'పుష్ప ది రైజ్' చిత్రం సంచలన విజయం సాధించిన విషయం విదితమే. 2021లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది ఆ చిత్రం. అల్లు అర్జున్ కెరీర్‌లోనే ఇది అతి పెద్ద విజయం కాగా, ఈ సినిమాతోనే ఆయన జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడిగా అవార్డ్ పొందారు. దీనికి సీక్వెల్‌గా 'పుష్ప 2 ది రూల్' రూపొందుతోంది. ఈ సినిమా ఎప్పుడెప్పుడు విడుదలవుతుందా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రేక్షకులలో చిత్ర యూనిట్ ఇటీవల విడుదల తేదీ ప్రకటించి జోష్ పెంచింది. తాజాగా సోమవారం మరో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను నిర్మాతలు ఇచ్చారు. మరో రెండు వందల రోజుల్లో 'పుష్ప 2' వస్తుందంటూ ప్రత్యేక పోస్టర్ విడుదల చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్, ధనుంజయ్, సునీల్, అనసూయ తదితరులు నటిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు.



సమస్యలు చెప్పాం... పరిష్కారాలూ చెప్పమన్నారు

దిల్‌రాజు

'పరిశ్రమలోని సమస్యల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారితో గంట పదిహేను నిమిషాల పాటు నిర్మాతలందరం కలిసి చర్చించడం జరిగింది. సమస్యలేకాదు, పరిష్కారాలు కూడా మీరే చెప్పండి.. ప్రభుత్వం నుంచి ఏం కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.' అని దిల్ రాజు చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ దిల్ రాజు మాట్లాడారు. 'పరిశ్రమలోని సమస్యలపై ఎల్లుండి ఈసీ మీటింగ్ పెడుతున్నాం. సమస్యల పరిష్కారాలతో త్వరలోనే మళ్లీ సీఎంని కలుస్తాం. ఎల్లుండి నిర్వహించే ఈసీ మీటింగ్‌లో తీసుకోబోయే నిర్ణయాలు రాబోవు తరాలకు వారధిలా ఉంటాయి.' అని దిల్‌రాజు తెలిపారు. ఇంకా చెబుతూ 'ఛాంబర్ నిర్ణయాన్ని గౌరవిస్తూ సంక్రాంతి బరి నుంచి తొలగిన 'ఈగల్' చిత్రం ఫిబ్రవరి 9న విడుదల కానుంది. పీపుల్‌మీడియా టి.జి.విశ్వప్రసాద్, వివేక్, హీరో రవితేజగార్లకు ఈ సందర్భంగా కృతజ్ఞత తెలియజేస్తున్నాం. అదే రోజున 'ఊరుపేరు భైరవకోన' సినిమా డేట్‌ను కూడా ఎనౌన్స్ చేశారన్న విషయం ఛాంబర్ దృష్టికి రాగానే, నిర్మాతలు అనిల్ సుంకర, రాజేష్‌గార్లతో మాట్లాడటం జరిగింది. ఛాంబర్ వినతిని మన్నించి వాళ్లు కూడా తమ సినిమా డేట్‌ని ఫిబ్రవరి 16కు మార్చుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఫిబ్రవరి 9న విడుదల కానున్న 'ఈగల్' సినిమాకు ఎక్కువ థియేటర్లు వచ్చేలా చూస్తాం' అని దిల్‌రాజు తెలిపారు. 'అదే డేట్‌లో 'యాత్ర 2' రిలీజ్‌ను కూడా ఫిక్స్ చేశారు. అయితే, రాజకీయ కారణాల దృష్ట్యా ముందే డేట్ ఫిక్స్ చేసుకోవడం చేత, వాళ్లు విడుదల తేదీ మార్పుకు అంగీకరించలేదు. అలాగే, రజనీకాంత్ ప్రత్యేక పాత్ర పోషించిన 'లాల్ సలామ్' కూడా అదే డేట్‌లో విడుదల కానుంది. ఈ విషయంపై పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ వాళ్లతో చర్చిస్తే, ఆ రెండు సినిమాలవల్ల తమకు ఇబ్బంది లేదని వాళ్లు చెప్పారు' అని దిల్‌రాజు తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ ప్రెసిడెంట్ వి.దామోదరప్రసాద్, సెక్రటరీ టి.ప్రసన్నకుమార్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రతినిధి వివేక్ కూచిభొట్ల తదితరులు మాట్లాడారు.

కొరటాలకు సుప్రీంకోర్టులో చుక్కెదురు



కథల కాపీరైట్స్ అంశంపై చిత్రపరిశ్రమలో వివాదాలు తలెత్తడం పరిపాటే. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన 'గోరింటాకు'(1979) చిత్ర కథ విషయంలోనూ గతంలో ఇటువంటి వివాదమే చోటుచేసుకుంది. కథ నాదే నంటూ రచయిత్రి రంగనాయకమ్మ, 'గోరింటాకు' చిత్ర కథారచయిత్రి రామలక్ష్మిపై కోర్టుకు వెళ్లారు. చివరకు ఆ కేసులో రంగనాయకమ్మ విజయం సాధించారు. దాదాపు అలాంటి వివాదమే మహేశ్‌బాబు 'శ్రీమంతుడు'(2015) సినిమా విషయంలో కూడా ఎనిమిదేళ్లుగా జరుగుతోంది. 'శ్రీమంతుడు' కథ తనదేనని, స్వాతి పత్రికలో ప్రచురితమైన తన కథను కాపీ చేసి 'శ్రీమంతుడు' సినిమా తీశారని శరత్‌చంద్ర అనే రచయిత అప్పట్లో సినీరచయితల సంఘానికి ఫిర్యాదు చేశారు. పరిశ్రమ పెద్దల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లారు. న్యాయం జరిగేలా లేదని మీడియా ముందు కూడా తన గోడును వెళ్లబోసుకున్నారు. చివరకు నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. పిటీషన్‌పై విచారణ జరిపిన కోర్టు కొరటాలపై చర్యలు తీసుకోవాలంటూ ఆదేశించింది. దాంతో కొరటాల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. శరత్‌చంద్ర చూపిన ఆధారాలను నిర్ధారిస్తూ రచయితల సంఘం ఇచ్చిన నివేదనకు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, నాంపల్లి కోర్ట్ ఉత్తర్వులను సమర్థించడంతో కొరటాలకు సుప్రీంకోర్ట్ మెట్లెక్కక తప్పలేదు. ఇప్పుడు అక్కడ కూడా కొరటాలకు చుక్కెదురైంది. కొరటాల శివ దాఖలు చేసిన పిటీషన్‌పై జస్టిస్ హృషికేశ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ధర్మాసనం విచారణ చేపట్టింది. సినిమా విడుదలైన 8 నెలల తర్వాత శరత్‌చంద్ర కోర్టును ఆశ్రయించారని, హైకోర్టు, స్థానిక కోర్టు తమ వాదనలను ఎక్కడా పరిగణనలోకి తీసుకోలేదని కొరటాల తరపున న్యాయవాదైన వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ నిరంజన్‌రెడ్డి వాదనలను వినిపించగా, సుప్రీం ధర్మాసనం ఆ వాదనలను తోసిపుచ్చింది. రచయితల సంఘం నివేదిక ఆధారంగానే హైకోర్ట్ నిర్ణయం తీసుకుందని, పిటీషనర్ కొరటాల పిటీషన్‌ని పరిగణనలోకి తీసుకొని తదుపరి విచారణ జరిపేందుకు కూడా ఏమీ లేదని సుప్రీం స్పష్టం చేసింది. 'పిటీషన్‌ను వెనక్కి తీసుకుంటారా? మమ్మల్నే డిస్మిస్ చేయమంటారా?' అని ధర్మాసనం కొరటాల తరపు న్యాయవాది నిరంజన్‌రెడ్డిని ప్రశ్నించింది. తామే పిటీషన్‌ను వెనక్కి తీసుకుంటాం అని నిరంజన్‌రెడ్డి చెప్పడంతో సుప్రీం కోర్టు అనుమతి మంజూరు చేసింది.



'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/8M2yIAe లో చదవండి.

ఉత్తమ నటుడు రణబీర్, ఉత్తమ నటి అలియా

● 12th ఫెయిల్ చిత్రానికి ఆరు అవార్డులు

● కలర్‌ఫుల్‌గా జరిగిన ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక







బాలీవుడ్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఫిల్మ్‌ఫేర్ అవార్డుల వేడుక ఆదివారం సాయంత్రం గుజరాత్‌లో కలర్‌ఫుల్‌గా జరిగింది. 2023లో విడుదలైన చిత్రాలకు సంబంధించి విజేతలకు అవార్డులు అందించారు. గత ఏడాది 'పఠాన్', 'జవాన్', 'దంకీ' చిత్రాల వరుస విజయాలతో ముందంజలో ఉన్న షారుఖ్‌ఖాన్ పేరు ఉత్తమ నటుడిగా నామినేషన్స్ లిస్ట్‌లో ఉన్నా, ఫైనల్‌గా మాత్రం 'యానిమల్' లో అద్భుతంగా నటించిన రణబీర్ కపూర్ కు అవార్డ్ దక్కింది. ఈ సినిమా మీద ఎంత కాంట్రవర్సీ వచ్చినా ఘన విజయం సాధించడం గమనార్హం. ఉత్తమ నటుడు అవార్డ్‌తో పాటు మరో మూడు అవార్డులు ఈ చిత్రానికి దక్కాయి. షారుఖ్ ఖాన్ 'జవాన్' చిత్రం యాక్షన్, వీఎఫ్ఎక్స్ లకు మాత్రం రెండు అవార్డులతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. బెస్ట్ యాక్టర్‌గా నామినేట్ అయిన మరో హీరో విక్కీ కౌశల్ 'దంకీ' చిత్రంతో ఉత్తమ సహాయ నటుడి అవార్డ్ పొందారు. ఇక 'రాకీ ఔర్ రాణీకి ప్రేమ్ కహానీ' సినిమాలో అత్యుత్తమ నటన ప్రదర్శించిన అలియా భట్ ఉత్తమ నటి పురస్కారం పొందారు. ఈ సినిమాలోనే నటించిన షబానా అజ్మీ ఉత్తమ సహాయ నటి అవార్డ్ సాధించారు. ఇటీవల విడుదలైన విజయం సాధించిన '12th ఫెయిల్' ఉత్తమ చిత్రంగా ఎన్నిక కావడమే కాకుండా మరో ఐదు అవార్డులు పొందింది. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన విధు వినోద్ చోప్రా ఉత్తమ దర్శకుడిగా ఎన్నికయ్యారు. మనోజ్ వాజ్‌పేయి నటించిన 'జోరామ్' క్రిటిక్స్ బెస్ట్ ఫిల్మ్ అవార్డ్ పొందింది.. డేవిడ్ ధావన్‌ను జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించారు. తారల తళుకు బెళుకులు, నృత్యాలతో ఆద్యంతం ఆసక్తికరంగా ఈ వేడుక సాగింది.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు, మహిళలు

రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశారు

● 1504వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, జనవరి 29: వైసీపీ ప్రభుత్వం ఇచ్చేది గోరంత పన్నుల బాదుడుతో తీసుకునేది కొండంత అని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, జై ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1504వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ రాష్ట్ర రాజధానికి ప్రత్యేక హోదా తీసుకొస్తామని చెప్పిన సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులని హోదాను పడేకేయించారని అన్నారు. దాని గురించి ప్రజలు నోళ్లు మూయించటానికి మూడు ముక్కల ఆట పెట్టారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే కేంద్రం నుంచి ప్రత్యేకహోదా తేవాలన్నారు. వేల ఎకరాలిస్తే అమరావతి అభివృద్ధి కొనసాగించక పోవటం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర రాజధానికి జీవనాధారమైన భూములిస్తే నిర్మాణాలు కొనసాగించకుండా మూడు ముక్కలతో అన్నదాతను నాలుగున్నర ఏళ్ళ నుంచి అష్టకష్టాలు సీఎం జగన్‌రెడ్డి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వార్షిక కౌలు కూడా ఇవ్వకుండా కోర్టు చుట్టూ తిప్పుతున్నాడన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. జయహో అమరావతి, జై ఆంధ్ర ప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

దేగల ప్రభాకర్ భారీ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దేగల ప్రభాకర్

గుంటూరు, జనవరి (ఆంధ్రజ్యోతి) 29: 'రా కదలిరా!' బహిరంగ సభ సందర్భంగా టీడీపీ నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. 300 మోటార్ సైకిళ్లు, 50 కార్లతో భారీ ర్యాలీగా పొన్నూరు నియోజకవర్గం వడ్లమూడి సభకు తరలివెళ్లారు. కొత్తపేట ఎన్టీఆర్ విగ్రహానికి, బస్టాండ్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఈ సందర్భంగా ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దేగల ప్రభాకర్ మాట్లాడుతూ 'రా కదలిరా!' కార్యక్రమాన్ని చూసి జగన్ వెన్నులో వణుకు పుడుతోందన్నారు. జగన్ అరాచకాలను భూస్థాపితం చేయడానికి ప్రజలు సిద్ధంగా వున్నారన్నారు.

క్రీడాకారులతో.. తొండాట!

● ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు మొండిచేయి
● విజేతలకు తొలుత రూ.35 వేలన్నారు.. ఇప్పుడేమో రూ.25 వేలేనట?
● అది కూడా అకౌంట్లో వేస్తామంటున్నారు
● ఎంపీడీవో కార్యాలయం వద్ద క్రీడాకారుల నిరసన



నగదు ఎందుకు ఇవ్వరంటూ ఎంపీడీవో కె.శివపార్వతిని నిలదీస్తున్న గెలుపొందిన క్రీడాకారులు

రేపల్లె, జనవరి 29: ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతి ఇవ్వాల్సి ఉండగా, మాకు నిధులు రాలేదంటూ అధికారులు చేతులు ఎత్తేయడంతో విజేతలు ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీవో కె.శివపార్వతిని క్రీడాకారులు నిలదీశారు. నిజాంపట్నం మండలానికి చెందిన క్రీడాకారులు 24వతేదీన జరిగిన వాలీబాల్ ఫైనల్స్‌లో ప్రథమస్థానం సాధించారు. నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో గెలుపొందిన వారికి ఒక్కొక్క జట్టుకి మెడలు, ప్రశంసా పత్రం రూ.35వేలు నగదు బహుమతి ఇవ్వాల్సి ఉంది. అయితే గెలుపొందిన జట్లకు ప్రశంసా పత్రం, మెడల్ మాత్రమే ఇస్తామంటూ అధికారులు తెలపటంతో క్రీడాజట్లు నిరాశకు లోనయ్యారు. గెలుపొందిన క్రీడాకారులైన బొమ్మిడి శ్రీనివాసరావు, సికనం శేషగిరి, భూషణం, మౌనిక, మానస, శివపార్వతి, మరికొంతమంది క్రీడాకారులు మాట్లాడుతూ కష్టపడి గెలిస్తే ప్రభుత్వం ఈవిధంగా మోసం చేస్తుందని అనుకోలేదన్నారు. మూడు పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఒక్కో ఆటకి రూ.35వేలు చొప్పున లక్షా ఐదు వేలు రావాల్సి ఉందని కానీ ఒక్క రూపాయి కూడా ఇచ్చిన దాఖలాలు లేవని క్రీడాకారులు ఆరోపించారు. ఈ విషయమై ఎంపీడీవో కె.శివపార్వతిని అడగ్గా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి రూ.25వేలు మాత్రమే మంజూరు చేశామని నగదు బహుమతి తర్వాత ఇస్తామని తెలిపారు. ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ ఇస్తే త్వరలో మీ అకౌంట్‌లలో నగదు బదిలీ అవుతుందని క్రీడాకారులకు తెలిపారు.

ఆడుదాం ఆంధ్రాలో బాహాబాహి

● న్యాయ నిర్ణేతలను దూషించిన క్రీడాకారులు





క్రీడా మైదానంలో విరిగిన కుర్చీలు, మైదానంలో పోలీసుల బందోబస్తు

కొల్లూరు, జనవరి 28: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు బాహాబాహికి దారి తీశాయి. సోమవారం కొల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో క్రీడాకారులు న్యాయ నిర్ణేతను దూషించి చొక్కా పట్టుకున్న సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమృతలూరు, చుండూరు మండలాల జట్లు ఖోఖో పోటీల్లో తలపడ్డాయి. ఆట ప్రారంభం నుంచే చుండూరు జట్టు క్రీడాకారులు దురుసుగా ప్రవర్తిస్తూ పేచీలు పెట్టడంతో న్యాయ నిర్ణేతలు ఇది తగదని వారించిన వినకపోవడంతో ఆటను నిలిపివేసి ఆ జట్టు కెప్టెన్ నిర్ణయం మేరకు అమృతలూరు జట్టును విజేతగా ప్రకటించారు. అనంతరం చుండూరు జట్టు క్రీడాకారులు న్యాయ నిర్ణేతలను పరుష పదజాలంతో దూషిస్తూ గొడవకు దిగారు. దీంతో క్రీడలను తిలకించేందుకు వచ్చిన వారు ఇది తగదని వారించినా వినకపోవడం పైగా న్యాయ నిర్ణేతలను చొక్కా పట్టుకోవడంతో సహించలేని జనం చుండూరు జట్టు క్రీడాకారులకు దేహశుద్ధి చేశారు. న్యాయ నిర్ణేతలు జోక్యం చేసుకుని వారిని క్రీడా మైదానం నుంచి బయటకు పంపి వేశారు. చుండూరు జట్టు క్రీడాకారులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి జరిగిన గొడవ గురించి పోలీసులకు వివరించారు. స్పందించిన ఎఎస్‌ఐ రామయ్య ఇరువురు పోలీసులను వెంట పెట్టుకుని క్రీడా మైదానంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైకుంఠపురం బ్యారేజ్‌తో కృష్ణా డెల్టా స్థిరీకరణ



చంద్రబాబుకు వినతిపత్రం అందచేస్తున్న సాగునీటి వినియోగదారుల సంఘాల నాయకులు

పొన్నూరుటౌన్ (చేబ్రోలు), జనవరి 29: వైకుంఠపురం బ్యారేజ్‌తో కృష్ణా డెల్టా ఆయకట్టు స్థిరీకరించాలని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య నాయకులు చంద్రబాబుకు వినతిపత్రం సమర్పించారు. సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకటగోపాలకృష్ణారావు మాట్లాడుతూ కృష్ణా, పశ్చిమ డెల్టా వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. టీడీపీ హయాంలో ప్రాజెక్టుల నిర్మాణం శరవేగంగా సాగితే వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో వైకుంఠపురం వద్ద పది టీఎంసీల నిల్వ సామర్థ్యంతో బ్యారేజిని నిర్మించాలని విజ్ఞప్తిచేశారు. ఈ నీటి ద్వారా కృష్ణ, గుంటూరు, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 13 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించటమే కాక అమరావతి రాజధానికి పుష్కలంగా తాగునీరు అందే అవకాశం ఉందని వారు చంద్రబాబు దృష్టికి తెచ్చారు.

ప్రతి ఒక్కరిపై దైవాశీస్సులు

● మహోత్సవాల కన్వీనర్ శామ్యూల్ కిరణ్
● ముగిసిన బైబిల్ మహోత్సవాలు





బైబిల్ మిషన్ మహోత్సవాల్లో ప్రసంగిస్తున్న అధ్యక్షుడు జే శామ్యూల్ కిరణ్, ప్రార్థనలకు హాజరైన భక్తులు

పెదకాకాని, జనవరి 29: గత నాలుగు రోజులుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట జరుగుతున్న బైబిల్ మిషన్ 86వ మహోత్సవాలు సోమవారం ముగిశాయి. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా భారతదేశంలోని అనేక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు సోమవారం జరిగిన ముగింపు ప్రార్థనలో బైబిల్ మిషన్ అధ్యక్షులు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యూల్ కిరణ్ మాట్లాడుతూ దేవుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరారు. దేవుని కృపతో బైబిల్ మిషన్ దినదినాభివృద్ధి చెందుతుందని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి మహోత్సవాల నిర్వహణ విషయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు)ను అమలు పరచాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఎంతో కాలం నుంచి చలువ పందిళ్లలో మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. భక్తుల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని ఎలాంటి రసాయనాలు మిళితం కాని బియ్యాన్ని ఆహారంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. అపరిమితమైన విశ్వాసంతో హాజరవుతున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. బైబిల్ మిషన్ మహోత్సవాలు విజయవంతంగా జరిగినందుకు ఫిబ్రవరి నాలుగో తేదీన విజయోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు కిరణ్ పేర్కొన్నారు. మహోత్సవాలకు సహకరించిన అన్ని కమిటీలు, ప్రభుత్వ శాఖలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మహోత్సవాల్లో అనేకమంది పాస్టర్లు సందేశాన్ని అందజేశారు. భక్తులు తమ స్వస్థలాలకు తరలివెళ్లారు. వారి కోసం ఆర్టీసీ, రైల్వే ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశాయి.

వైసీపీ రౌడీలు.. గూండాల పార్టీ అని మరోసారి నిరూపితమైంది

● మాజీ మంత్రి కన్నా రాళ్ళ దాడిని ఖండించిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జనవరి 29: వైసీపీ అంటేనే రౌడీలు, గూండాలు, గంజాయి బ్యాచ్ పార్టీ అని మరొకసారి నిరూపితమైందని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. మంత్రి అంబటి ప్రోద్బలంతో వైసీపీ గూండాలు గంజాయి, మత్తు, అధికార మదంతో తొండపిలో కన్నాపై చేసిన హత్యాయత్నమే ఇందుకు నిదర్శనమన్నారు. పోలీసుల సమక్షంలోనే దాడి జరగటం, కనీసం వారు అడ్డుకొనే ప్రయత్నం కూడా చేయకపోవటం రాష్ట్రంలో జరుగుతున్న వైసీపీ అరాచక పాలనకు అద్దం పడుతోందని సోమవారం ఒక ప్రకటనలో ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. రౌడీయిజం, భౌతికదాడులతో ప్రతిపక్షాలను భయపెట్టాలని చూస్తున్నారన్నారు. ఈ ఘటనకు మంత్రి అంబటి, స్థానిక పోలీసు అధికారులే బాధ్యత వహించాలన్నారు. ఇదే సమయంలో మాచర్ల నియోజకవర్గంలో పోలీసులే వైసీపీలో చేరికల కోసం పనిచేస్తుండటం విస్తుగొలుపుతుందన్నారు. వెల్దుర్తి ఎస్‌ఐ శ్రీహరి అరాచకాలకు ఒక మత్స్య కార్మికుడు బలికావటం కలచివేసిందన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేయటం ఖాయమని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

పల్నాడు ఎస్పీని సస్పెండ్ చెయ్యాలి

- కాపు ఉద్యమ నేత వేల్పూరి

గుంటూరు సిటీ, జనవరి 29: ప్రతిపక్ష పార్టీల నేతల సభలు, సమావేశాలకు సరైన భద్రత కల్పించే విషయంలో పూర్తిగా విఫలమైన పల్నాడు జిల్లా ఎస్పీని వెంటనే సస్పెండ్ చేయాలని సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పూరి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి, టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణపై వైసీపీ గుండాలు దాడి చేస్తుంటే పోలీసులు చూస్తూ కూర్చోవడం దారుణమని అన్నారు. రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు సంకటి లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గూండారాజ్యం నడుస్తోందన్నారు. జనసేన, టీడీపీ పొత్తుకు కాపు సంఘాలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వారు ప్రకటించారు.

ఉభయ రామేశ్వర క్షేత్రం దర్శించనున్న భువనేశ్వరి

కొల్లూరు, జనవరి 28: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా చెరుకుపల్లి పర్యటన చేస్తున్న నారా చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి కొల్లూరు మండలం చిలుమూరులోని ఉభయ రామేశ్వర క్షేత్రాన్ని మంగళవారం సందర్శించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుండి రోడ్డు మార్గాన తాడేపల్లి నుంచి కరకట్ట మీదుగా ఉదయం 10 గంటలకు కొల్లూరు మండలం చిలుమూరులోని ఉభయ రామలింగేశ్వర స్వామి ఆలయంలో నారా భువనేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రోడ్డు మార్గాన కొల్లూరు, భట్టిప్రోలు మీదుగా చెరుకుపల్లి చేరుకుంటారన్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని చిలుమూరులో స్వాగతం పలికి భట్టిప్రోలు వరకు జరిగే ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తొండపిలో పోలీసు పికెటింగ్

సత్తెనపల్లి జనవరి 29: ముప్పాళ్ళ మండలం తొండపిలో వైసీపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కాన్వాయ్‌పై రాళ్ళ దాడి చేసిన నేపథ్యంలో సోమవారం గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతోంది. ముందస్తు చర్యలలో భాగంగా గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెట్ నిర్వహిస్తున్నారు. గ్రామంలో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఫ్లెక్సీని కూడా చించివేశారు. ఒక పథకం ప్రకారం ఈ రాళ్ళ దాడి జరిగిందని టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. పోలీసుల సమక్షంలోనే జరిగిన రాళ్ళ దాడిని టీడీపీ శ్రేణులు తీవ్రంగా పరిగణిస్తున్నాయి.

ఇరువర్గాలపై కేసులు నమోదు

ముప్పాళ్ళ జనవరి 29: మండలంలోని తొండపిలో వైసీపీ కార్యకర్తలు ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కాన్వాయ్‌పై, రాళ్ళ దాడిచేసిన వారిపై తొండపి గ్రామ, మండల టీడీపీ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు న్యాయవాది, టీడీపీ నాయకులు పూజల వెంకటకోటయ్య, అబ్దుల్ మజీద్, రావిపాటి మధుబాబు, నానయ్య, రాయిడి అప్పారావు బాషా, గుత్తా రామారావు, కొల్లా యుగంధర్, తెల్లజర్ల వెంకటేశ్వర్లు, అత్తోట వెంకటకృష్ణ పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. తొండపిలో జరిగిన గొడవలో ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ముప్పాళ్ళ ఎస్‌ఐ హజరతయ్య సోమవారం తెలిపారు.







తొండపిలో ఏర్పాటుచేసిన పోలీసు పికెటింగ్, వైసీపీ కార్యకర్తలు విసిరిన రాళ్లు, చించివేసిన టీడీపీ ఫ్లెక్సీ

నియంతృత్వ అధికారులు ఇకనైనా పద్ధతి మార్చుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జనవరి29: పల్నాడులో పనిచేస్తున్న కొందరు పోలీసు అధికారులు నియంతృత్వ ధోరణి ఇకనైనా మానుకొని చట్టప్రకారం నడుచుకుంటే అభ్యంతరం వుండదని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి శారీరకంగా హింసకు గురిచేసిన అధికారులను కచ్చితంగా గుర్తుంచుకుంటామన్నారు. రేపటి ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇప్పుడు నియంతలా వ్యవహరించిన కొందరు అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. వెల్దుర్తిలో ఒకమత్స్యకార సామాజికవర్గానికి చెందిన వ్యక్తి పోలీసుల అక్రమ కేసులకు భయపడి చనిపోవడం బాధాకరమన్నారు. తొండపిలో ఆదివారం రాత్రి మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణపై వైసీపీ గూండాలు దాడి చేయడాన్ని కూడా యరపతినేని ఖండించారు. సత్తెనపల్లి డీఎస్పీ ప్రోద్బలంతోనే ఇవన్నీ జరుగుతున్నాయని టీడీపీ కార్యకర్తల నుంచి వినిపిస్తుందన్నారు. తొండపి, వెల్దుర్తి ఘటనలపై, జూలకంటి బ్రహ్మారెడ్డిపై తప్పుడు కేసులను ఖండిస్తున్నామని యరపతినేని తెలిపారు. జగన్‌ను ఓడించి ఇంటికి పంపేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని యరపతినేని శ్రీనివాసరావు మరో ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు ఇక 74 రోజులు మాత్రమే సమయం వుందని, వైసీపీ దురాగతాలకు ప్రజాకోర్టులో శిక్ష పడే సమయం ఆసన్నమైందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నివిధాల నాశనం చేసిన వైసీపీ పార్టీ ప్రజలకు అవసరం లేదనేది అర్థమవుతుందని తెలిపారు. ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తిచేయకపోగా, టీడీపీ అధికారంలో వుంటే సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేయన్నారు.

అగ్నిబాధిత రైతులను పట్టించుకోరా?

● పసుపు రైతుల సదస్సులో టీడీపీ, రైతుసంఘాల నాయకులు



అగ్నిప్రమాద బాధిత రైతుల సదస్సులో మాట్లాడుతున్న మాజీమంత్రి నక్కా ఆనందబాబు

దుగ్గిరాల, జనవరి 29: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజి అగ్నిప్రమాద బాధిత రైతులకు పరిహారం అందించే వరకూ బాధిత రైతులకు తోడుగా నిలబడతామని మాజీమంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. ఈనెల 19న స్థానిక కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులకు అండగా సోమవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆనందబాబు పాల్గొన్నారు. కోట్లాదిరూపాలయ నష్టం జరిగితే మంత్రులు, ముఖ్యమంత్రి కార్యాలయంలో అధికారులు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. లక్షా 15వేల బస్తాల పసుపు అగ్నికి ఆహుతై రూ.120 కోట్ల నష్టమని ప్రాథమిక అంచనా వేస్తున్నారన్నారు. ఏడెనిమిదేళ్లుగా పసుపునకు గిట్టుబాటు ధరలేక పోవడంతో కోల్డ్‌స్టోరేజీలో పంటనిల్వలు విక్రయించుకోలేదన్నారు. నేటివరకూ అద్దె, బీమా చెల్లిస్తున్నప్పటికీ రైతుల నష్టం ఏవిధంగా చెల్లిస్తారో చెప్పాలన్నారు. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.10వేల నుంచి రూ.12వేల వరకూ పలుకుతోందని, అమ్ముకుందామనుకునేలోపే ప్రమాదం చోటు చేసుకోవడం దురదృష్టకరమన్నారు. యజమాని సైతం కాలినగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, 10రోజులైనప్పటికీ అధికారులెవ్వరూ కనీసం పరామర్శించిన దాఖలాల్లేవన్నారు. సీపీఐ రాష్ట్రసహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ, రైతులకు ఆపదవస్తే పార్టీలకతీతంగా ఆదుకోవాల్సిన ప్రభుత్వం నేటివరకూ స్పందించక పోవడం దురదృష్టకరమన్నారు. రైతుసంఘ రాష్ట్రప్రధాన కార్యదర్శి కేవీ ప్రసాద్, పసుపు రైతుల రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘ రాష్ట్రకార్యదర్శి పి.జమలయ్య, గుంటూరు మిర్చియార్డు మాజీచైర్మన్ మన్నవ సుబ్బారావు, జిల్లా సీపీఐ కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, పసుపు రైతుసంఘ అధ్యక్షుడు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, రైతుసంఘ కార్యదర్శి పచ్చల శివాజీ, కొల్లి రంగారెడ్డి, యార్లగడ్డ శివయ్య, పలువురు బాధిత పసుపురైతులు, రైతుసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కన్నాపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



నరసరావుపేట టౌన్, జనవరి 29: మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో అన్నారు. ముప్పాళ్ళ మండలం తొండేపిలో ఆదివారం మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మరికొందరు టీడీపీ కార్యకర్తలపై జరిగిన రాళ్ళ దాడిని తీవ్రంగా ఖండించారు. మంత్రి అంబటి రాంబాబు ప్రోత్సాహంతో వైసీపీ దుండగులు ఈ బరితెగింపునకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించగా సభకు ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి కన్నా హాజరుకావటం జరిగిందన్నారు. గ్రామంలో వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరుతుండటం జీర్ణించుకోలేక వైసీపీ మూకలు మంత్రి అంబటి ప్రోత్సాహంతో రాళ్లదాడికి తెగబడ్డారని అన్నారు. పోలీసుల సమక్షంలోనే సభ జరుగుతున్న ప్రాంతంలో ముందుగానే పథకం ప్రకారం వైసీపీ దుండగులు లైట్లు ఆర్పి భవనాలపై నుంచి ఒక్కసారిగా రాళ్ల వర్షం కురిపించి దాడికి పాల్పడడం అత్యంత దుర్మార్గమని చెప్పారు. రాళ్లదాడిలో కన్నా లక్ష్మీనారాయణ పీఏ స్వామికి తీవ్రగాయాలు కాగా, శ్రీధర్, మాజీ ఎంపీపీ పచ్చల నాగేశ్వరరావు గాయపడటం జరిగిందన్నారు. రాళ్ళ దాడికి పాల్పడిన వైసీపీ దుండగులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

గుంటూరు సిటీ, జనవరి 29: జడ్పీ 10వ స్థాయి సంఘ సమావేశాలు మంగళవారం ఉదయం గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం నందు నిర్వహించనున్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, జెడ్పీ సీఈవో జె.మోహన్‌రావు అధ్యక్షతన సమావేశాలు జరగనున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు



అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

గుంటూరు మిర్చియార్డులో ధరలు ఇలా...

గుంటూరు, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,05,823 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 98,079 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 67,096 టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఇలా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			సూపర్ 10	--	--
334	9000	20000	నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
నెంబరు. 5	13000	9000	తేజ	8000	21500
273	14000	15200	బ్యాడిగి	10500	20000
341	11000	20000	దేవనూరు డీలక్స్	11000	18000
4884	11000	15000	తెల్లకాయలు	5000	13000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

కన్నాపై రాళ్ళ దాడికి ఖండనలు

ప్రజలే సరైన గుణపాఠం చెబుతారు : కన్నా

సత్తెనపల్లి, జనవరి 29: మంత్రి అంబటి రాంబాబు చేయించిన రాళ్ళ దాడికి రానున్న ఎన్నికల్లో సత్తెనపల్లి ప్రజలే సరైన గుణపాఠం చెబుతారని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధి స్థానంలో ఉన్న మంత్రి అంబటి రాంబాబు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులను ప్రోత్సహిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నాడన్నారు. ప్రతి చర్యకు ఓటుతో సమాధానం లభిస్తుందన్నారు. దాడిలో గాయపడ్డ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

ఓటమి భయంతోనే దాడి : బాజీ చౌదరి

సత్తెనపల్లి, జనవరి 29 : తొండపి గ్రామంలో కన్నా లక్ష్మీనారాయణ, పార్టీ శ్రేణులపై రాళ్ళ దాడి చేయించటం మంత్రి అంబటి పిరికిపంద చర్య అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటమి భయంతో, అభద్రతా భావంతో మంతి అంబటి రాంబాబు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు.

సత్తెనపల్లి, జనవరి 29 : ముప్పాళ్ళ మండలం తొండపిలో కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు రాళ్ళ దాడి చేయటాన్ని టీడీపీ లీగల్ సెల్ నేతలు, ఎస్సీ నేతలు, బీసీ సెల్ నేతలు ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ ప్రజావేదికలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో ఖండించారు. పోలీసులు దీనిపై నిష్పాతంగా విచారణ జరపాలన్నారు. కేసు నమోదు చేసి చట్టపరంగా నిందితులను అరెస్టు చేయాలన్నారు. సమావేశంలో పూజల వెంకట కోటయ్య, దివ్వెల శ్రీనివాసరావు, బొక్కా సంగీతరావు, బత్తుల ఆదినారాయణ, అనుమోలు జయరామ్, కొల్లా వెంకటేశ్వరరావు, జానీ ఖాజావలి, గుంటూరు వసంతరావు తదితరులు ఉన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటకం రామకృష్ణ, మరి కొందరు టీడీపీ నేతలు కూడా దాడి చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని టీడీపీ ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సీ సెల్ నేతలు బండారు నాగరాజు, బలిజేపల్లి సురేష్ కుమార్, గుంటూరు ఆశీర్వాదం, బొజ్జా కాంతారావు, వెలిసిల వెంకటరావు, గొలమాల ప్రభుదాసు, చిలకా శ్యామ్, చింతపల్లి అజయ్, చింతపల్లి లక్ష్మయ్య తదితరులు దాడిని ఖండించారు. కాగా సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యుడు నరిచేటి వేణుగోపాల్ కన్నా పై జరిగిన దాడిని ఒక ప్రకటనలో ఖండించారు. జన సేన నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకట అప్పారావు, జనసేన నేతలు కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు, రంగిశెట్టి సుమన్‌లు కూడా దాడిని తీవ్రంగా ఖండించారు.

మంత్రి అంబటి రాంబాబే దాడి చేయించారు : బత్తుల

ముప్పాళ్ళ జనవరి 29: తొండపిలో పెద్దఎత్తున ముస్లిం కుటుంబాలు టీడీపీలో చేరబోతున్నారనే అంశాన్ని జీర్ణించుకోలేక మంత్రి అంబటి రాంబాబు తన అనుచరులతో రాళ్ళ దాడులు చేయించారని మండల అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు ఆరోపించారు. ముప్పాళ్ళలో తొండపిలో టీడీపీలో చేరిన ముస్లింలు మండల టీడీపి నాయకులు సోమవారం సాయంత్రం విలేఖరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో న్యాయవాది, టీడీపీ నాయకులు పూజల వెంకట కోటయ్య, అబ్దుల్ మజీద్, రావిపాటి మదుబాబు, నానయ్య, మాభుసుభాని, రాయిడి అప్పారావు, పటాన్ లీలాఫర్, బాషా తదితరులున్నారు.

జనసేన నాయకుల ఖండన

సత్తెనపల్లి, జనవరి 29: కన్నా లక్ష్మీనారాయణపై ఆదివారం రాత్రి వైసీపీ కార్యకర్తల దాడిని జనసేన నాయకులు సిరిగిరి శ్రీనివాసరావు, చవిటి భవన్నారాయణ, తిరుమలశెట్టి మల్లేశ్వరి తదితరులు ఖండించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దొంగే దొంగ అని అరిచినట్టు దాడులు చేసిన వారే నాటకాలు ఆడుతూ ఆస్పత్రిలో జాయిన్ ఐతే మంత్రి పరామర్శించటం హాస్యాస్పందంగా ఉందన్నారు. దాడిపై విచారించి పోలీసులు చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని సిరిగిరి మణికంఠ, పసుపులేటి వెంకట స్వామి, అంచుల అనేష్ కుమార్ తదితరులు కోరారు. కాగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, ఎల్ రవి, మన్నవ శారదాదేవి, జీ శ్రీనివాసరావు తదితర టీడీపీ నేతలు కూడా కన్నాపై దాడిని ఖండించారు.

దాడి చేసిన వారి పై చర్యలు తీసుకోవాలి

నకరికల్లు, జనవరి 29 : తొండపిలో దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆలీ బాషా, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు అహమ్మద్‌లు డిమాండ్ చేశారు.

ఓటమి భయంతోనే రాళ్లదాడి

అమరావతి, జనవరి 29: రోజు రోజుకు కన్నా లక్ష్మీనారాయణకు పెరుగుతున్న ప్రజాదరణ తట్టుకోలేక ఓటమి భయంతో స్థానిక మంత్రి అంబటి రాంబాబు తన గూండాలతో రాళ్లదాడి చేయించడం పిరికి పందచర్య అని పల్నాడు జిల్లా కాపునాడు అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటసత్యనారాయణ అన్నారు. సోమవారం అమరావతిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డీఎస్పీ దీనిపై బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలుగుయువత అధ్యక్షుడు ఆలా వీరాబాబు, షేక్ బాబు, బి.వెంకటేశ్వరరావు, షేక్ షరీఫ్, యన్ రాంబాబు, కరీముల్లా, ఐజియ్య, సుందరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నాపై దాడి హేయం : పీఎస్‌కే రసూల్

బెల్లంకొండ, జనవరి 29: కన్నా లక్ష్మీనారాయణపై దాడి చేయటం హేయమని తెలుగుయువత మండల నాయకుడు పీఎస్‌కే రసూల్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాడికి పాల్పడిన వైసీపీ నాయకులపై కేసు నమోదు చేయాలన్నారు. సమావేశంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, తెలుగుయువత అధ్యక్షుడు సలాం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, ఎన్ పిచ్చయ్య, మజీద్, ఓర్సు రాంబాబు పాల్గొన్నారు.

దాడి ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ

అచ్చంపేట, జనవరి 29: వైసీపీ అల్లరిమూకలు చేసిన దాడి ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని టీడీపీ మండల నాయకులు విలేకరుల సమావేశంలో అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, గంధం కోటేశ్వరరావు, ఎస్‌కే కాసుల, తిరువాయిపాటి ఆంజనేయులు, రేపూడి తోమాస్, బుచ్చిబాబు, సాంబిరెడ్డి తదితరులున్నారు.

తొండపి ఘటనను ఖండించిన మంత్రి అంబటి

సత్తెనపల్లి, జనవరి 29: ముప్పాళ్ళ మండలం తొండపిలో జరిగిన ఘటనను ఖండిస్తున్నట్టు మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. సోమవారం ఏరియా వైద్యశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తానెప్పుడూ ఘర్షణలను ప్రోత్సహించలేదన్నారు. తొండపిలో ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్నాయన్నారు. తొండపి ఫ్యాక్షన్ గ్రామం అని ఆయన తెలిపారు. తొండపి ఘటన జరగటం దురదృష్టకరమన్నారు.

ఎంపీని కలసిన వైసీపీ అసమ్మతి నేతలు

సత్తెనపల్లి, జనవరి 29: నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలను సోమవారం గుంటూరులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో వైసీపీ అసమ్మతి నేతలు కలిశారు. వారిలో టీడీపీకి చెందిన సయ్యద్ మాబు, గుజ్జర్లపూడి సతీష్, వైసీపీ అసమ్మతి నేతలు కంటెపూడి వైసీపీ సర్పంచ్ యమున బొబ్బిలి, కొమెరపూడి సర్పంచ్ కొరివి అనీల్ కుమార్, గోగులపాడు సర్పంచ్ భూలక్ష్మి విజయ్, అబ్బూరు ఎంపీటీసీ యార్లగడ్డ అలేఖ్య కృపాకర్, గుడిపూడి సర్పంచ్ తొరటి తిరుపతయ్య, గోగులపాడు సర్పంచ్ భూలక్ష్మివిజయ్, పలుదేవర్లపాడు కుచేలురావు, మాదల బసవయ్య, గోగినేని కోటేశ్వరరావు, మదమంచి రాంబాబు, చాగంటివారిపాలెం బ్రహ్మారెడ్డి, కుమ్మరి దస్తగిరి, అమర్‌రెడ్డి, మేకల కామేశ్వరరావు, రహ్మతుల్లా తదితరులున్నారు.

కేసును తప్పుదోవ పట్టిస్తున్నారు : రూరల్ సీఐ సమీవుల్లా

మాచర్ల, జనవరి 29: వెల్దుర్తి మండలం జెండాపెంటకు చెందిన మత్స్యకారుడు దుర్గారావు ఆత్మహత్యను టీడీపీ నేతలు తప్పుదోవ పట్టిస్తున్నారని రూరల్ సీఐ సమీవుల్లా అన్నారు. మంగళవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దుర్గారావు మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. దుర్గారావు మృతదేహాన్ని కృష్ణానది నుంచి బయటకు తీసే సమయంలో దుర్గారావుపై మెడలో ఉరితాడు లేదని, పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి ఉరితాడు ఉందని అన్నారు. పోలీసులెవరూ కూడా ఇబ్బంది పెట్టలేదన్నారు. వెల్దుర్తి ఎస్ఐ శ్రీహరిపై వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. దుర్గారావు మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. ఆయన వెంట పట్టణ సీఐ శరత్‌బాబు ఉన్నారు.

నేటి దూడలే రేపటి పాడి పశువులు

● పశు సంవర్ధకశాఖ ఏడీ నరసింహారావు

బెల్లంకొండ, జనవరి 29: నేటి దూడలే రేపటి పాడి పశువులని, వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందని పశుసంవర్ధకశాఖ ఏడీ నరసింహారావు తెలిపారు. సోమవారం మండలంలోని మాచాయపాలెం గ్రామంలో పశు పోషణతో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షురాలు చెన్నపరెడ్డి పద్మ వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షత వహించారు. రాజుపాలెం ఏడీఏ వీరయ్య, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పశుపోషణపై అవగాహన

కారంపూడి, జనవరి 29: కారంపూడిలోని పశు వైద్యశాలలో రైతులకు పశుపోషణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మేలుజాతి లేగ దూడల ప్రదర్శన జరిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మోహన్‌రెడ్డి, డాక్టర్ పద్మావతి, శ్రీనివాసరెడ్డి, దిలీప్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలంటేనే బానిసలు కాదు.. గర్జించే సింహాలు

● ఒక్క అవకాశమివ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

● జయహో బీసీ సభలో జూలకంటి బ్రహ్మారెడ్డి



సభలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

దుర్గి, జనవరి 29: బీసీలంటే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బానిసలు కాదని, అవినీతి పాలకులపై గర్జించే సింహాలని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం దుర్గిలోని సత్యసాయిబాబా కల్యాణ మండపంలో దుర్గి, కారంపూడి మండలాల స్థాయిలో నిర్వహించిన జయహో బీసీ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాచర్ల నియోజకవర్గానికి రాహువు, కేతువు రూపంలో పిన్నెల్లి సోదరులు ప్రజలను పట్టి పీడిస్తున్నారని, వారిని తొందరగా సాగనంపితే గానీ పల్నాడుకు పట్టిన శని వదలదని అన్నారు. బీసీలంతా మావైపే ఉన్నారని ప్రగల్భాలు పలుకుతూ అత్యంత కిరాతకంగా బీసీలను చంపించి పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారన్నారు. మండలంలోని గుండ్లపాడుకు చెందిన తోట చంద్రయ్యను అతి కిరాతకంగా నడిరోడ్డుపై గొంతుకోసం చంపిన దుర్మార్గులు పిన్నెల్లి బ్రదర్స్ అని అన్నారు. బీసీలపై చంద్రబాబుకు ఉన్న ప్రేమ చంద్రయ్య పాడె మోయడంతో ప్రజలకు అర్థమైందన్నారు. ఫంక్షన్‌కు వెళ్తున్న టీడీపీ నేత కంచర్ల జల్లయ్యను దారి కాచి హతమార్చి సొంత ఊరికి కూడా మృతదేహాన్ని రాకుండా పోలీసులు అడ్డుకున్నారన్నారు. నారా లోకేశ్ బాధిత కుటుంబానికి అండగా నిలిచారన్నారు. దుర్గి మండలంలోని జంగమహేశ్వరపాడులో వందకు పైగా కుటుంబాలు ఊరు వదిలి ఎక్కడెక్కడో బతుకుతున్నప్పటికీ వదలడం లేదన్నారు. నాఎస్సీ, ఎస్టీ, బీసీ అని చెప్పే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆయా వర్గాలకు చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలన్నారు. దళిత యువకుడిని దారుణంగా చంపి డోర్ డెలివరీ చేసిన అనంతబాబును పక్కన తిప్పుకున్న దళిత ద్రోహిగా జగన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఎత్తైన అంబేద్కర్ విగ్రహాలు పెట్టి అభివృద్ధి అనడం సమంజసం కాదని, అంబేద్కర్ ఆశయాలు సాధించేలా



ర్యాలీగా వస్తున్న బ్రహ్మారెడ్డి , పార్టీ కార్యకర్తలు, అభిమానులు

బడుగు, బలహీన వర్గాలను రాజ్యాధికారంలోకి తీసుకురావడం అభివృద్ధి అన్నారు. వేల కి.మీ.లు పాదయాత్ర చేసి బడుగు, బలహీన వర్గాల బాధలు తెలుసుకొని సానపెట్టిన వజ్రంలా లోకేశ్ తయారయ్యారన్నారు. రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న జగన్‌రెడ్డిని సొంత చెల్లి, తల్లి నమ్మలేక బయటకు రావడాన్ని బట్టి అతని మనస్తత్వం ఎలాంటిదో ప్రజలు గమనిస్తున్నారన్నారు. వరుసగా నాలుగుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికైన రామకృష్ణారెడ్డి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏంటో చూపాలన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా సరైన రోడ్లు లేవని, తాగు, సాగునీరు అందించడంలో విఫలమయ్యారని, ఎప్పుడు చూసినా డబ్బులు డబ్బులు అని తపిస్తూ అక్రమ మద్యం, గ్రానైట్, భూ ఆక్రమణ ఇలా ప్రతి పనికి సంపాదన ఆశిస్తూ అన్నదమ్ములు కోట్లకు పడగలెత్తారే తప్ప ఇక్కడి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ఇప్పుడు విచిత్రంగా సొంత కార్యకర్తలను నమ్మలేక మద్దిమడుగు అంజనేయస్వామి గుడి వద్దకు తీసుకెళ్లి తమ వెంటే ఉండాలని ప్రమాణం చేయించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని, అరాచక శక్తులను ఏరివేస్తానని, బానిస సంకెళ్లను తెంచేస్తానని, ఇది రాష్ట్ర భవిష్యత్తుకు, దోపిడిదారులకు మధ్య పోరాటమని అన్నారు. టీడీపీ, జనసేన నేతలు కలిసికట్టుగా ఉండి పార్టీ గెలుపునకు పనిచేయాలన్నారు. బైబై పీఆర్కే అంటూ ప్రసంగం ముగించగా సభకు వచ్చిన బీసీ నాయకుల నినాదాలతో మార్మోగింది. ఈ సభకు బీసీలు భారీగా తరలివచ్చారు. తోట చంద్రయ్య, కంచర్ల జల్లయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు వేల్పుల సింహాద్రి యాదవ్, మద్దాల గంగాధర్, మున్నా రాంబాబు యాదవ్, సింగు నాగేశ్వరరావు, మేకల సాంబశివరావు, ముత్తనేని పుల్లయ్య, వేణు, బ్రహ్మయ్య, దుర్గా రామాంజినేయులు, మాచర్ల హనుమంతురావు, ఓర్సు కోటేశ్వరరావు, గోరంట్ల నాగేశ్వరరావు, హనుమంతురావు, సురేష్, కృష్ణవేణి, బాలకృష్ణ, కొమెర దుర్గారావు, గుండాల శ్రీనివాసరావు, నేరేటి వీరాస్వామి యాదవ్, చింతకాయల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే వైసీపీ దాడులు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, జనవరి 29: ఓటమి భయంతోనే వైసీపీ ప్రభుత్వం ప్రతిపక్ష నేతలపై దాడులకు పాల్పడుతుందని సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ఆయన నకరికల్లు మండలం కుంకలగుంటలో మాట్లాడుతూ సంవత్సరం క్రితం నుంచే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందన్నారు. దొంగ ఓట్లపై జగన్ ఆశలు పెట్టుకున్నాడని కన్నా ఆరోపించారు. ఎప్పటికప్పుడు టీడీపీ శ్రేణులు అప్రమత్తమై ప్రజలు ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి సారించినా వైసీపీ మాత్రం అక్రమాలు కొనసాగించే ప్రయత్నం చేస్తుందన్నారు. సత్తెనపల్లిలో మంత్రి కార్యాలయం నుంచే ఫారం - 7 దరఖాస్తులను అందజేసినట్టు కన్నా ఆరోపించారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేయటం ఖాయమని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావటం, సత్తెనపల్లిలో తాను గెలవటం ఖాయమన్నారు. పోలీసుల సహకారంతోనే ఆదివారం రాత్రి తొండపిలో తమపై దాడులకు వైసీపీ శ్రేణులు తెగబడ్డారన్నారు. ఒక పథకం ప్రకారం తనను, తన వారిని హత మార్చే కుట్ర జరిగిందని కన్నా ఆరోపించారు. సత్తెనపల్లి డీఎస్పీ పర్యవేక్షణలోనే ఇదంతా జరుగుతుందన్నారు. ఇటువంటి చర్యలు చేస్తున్న నాయకులు, పోలీసులపై టీడీపీ అధికారంలోకి వచ్చాక చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కన్నా అన్నారు. ఇలాంటి ఘటనలకు తాను గాని, టీడీపీ శ్రేణులు గాని బెదరరని వైసీపీ నాయకులు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, తాళ్ళ వెంకటేష్ యాదవ్, ఘంటా జగదీష్ బాబులు ఉన్నారు.

గ్రామీణులకు బాజీచౌదరి సేవలు అభినందనీయం: కన్నా

వైద్యశిబిరాలను నిర్వహించటంతో పాటు అవసరమైన వారికి కళ్ళజోళ్లను ఉచితంగా అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీచౌదరి అభినందనీయుడని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని కుంకలగుంటలో ఎన్‌జీఎస్ స్వచ్ఛంద సంస్థ కాటూరు మెడికల్ కళాశాల హాస్పిటల్ సంయుక్తంగా నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో పాల్గొన్న వారికి కళ్ళజోళ్ళను కన్నా, బాజీ చౌదరిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, తాళ్ళ వెంకటేష్‌యాదవ్, కనుమూరి సాంబశివరావు, జవ్వాజి మల్లికార్జునరావు, కనుమూరి రాజేంద్ర, కొల్లి హరిప్రసాదు, జగదీష్‌బాబు ఉన్నారు.



కుంకలగుంటలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ, పక్కన బాజీ చౌదరి, డాక్టర్ సాయికృష్ణ, వెంకటేష్‌యాదవ్

ఆవుల సుబ్బయ్యకు కన్నా పరామర్శ

కుంకలగుంట సాగునీటి సంఘం మాజీఅధ్యక్షుడు ఆవుల సుబ్బయ్యను కన్నా లక్ష్మీనారాయణ సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆవుల చిన్నబ్బాయి చిత్రపటానికి పూలమాల వేసి కన్నా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, తాళ్ళ వెంకటేష్ యాదవ్, టీడీపీ నేతలు రుసుం కోటయ్య, మర్రివేముల సిద్దయ్య, చేజర్ల రాజేంద్ర ప్రసాదు, పూల మస్తాన్‌రావు, చుండు గోవర్ధన్, బేరాల గోవిం దరాజులు తదితరులున్నారు.

పిడుగురాళ్ల కమిషనర్‌గా గిరికుమార్



గిరికుమార్

పిడుగురాళ్ల, జనవరి 29: పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా గిరికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పనిచేసిన ఏ వెంకటేశ్వర్లు నెల్లూరు జిల్లా గూడూరుకు బదిలీ కాగా, మున్సిపల్ సీఎండీ కార్యాలయంలో పనిచేస్తున్న గిరికుమార్ పిడుగురాళ్లకు బదిలీపై వచ్చారు.

టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడి మృతి

సత్తెనపల్లి, జనవరి 29: టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పురం ఆదాం(51) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. మండలంలోని గర్నెపూడికి చెందిన ఆయన టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆదాంకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆదాం మరణవార్త తెలుసుకున్న కన్నా లక్ష్మీనారాయణ విచారం వ్యక్తం చేశారు. ఆదాం మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ఎస్సీ సెల్ నేతలు పలువురు గర్నెపూడి వెళ్ళి ఆదాం మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. వారిలో బంగారు నాగరాజు, బొజ్జా కాంతారావు, గుంటూరు ఆశీర్వాదం, ఏకుల రాజశేఖర్, గొలమాల ప్రభుదాసు, బలిజేపల్లి సురేష్‌కుమార్, పల్లె మార్కురాజు, టీడీపీ నేతలు మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ళ అమరేశ్వరరావు, యర్ర వెంకటేశ్వరరావు, కోమటినేని శ్రీనివాసరావు, పలువురు నేతలు ఉన్నారు.

10 లీటర్ల నాటుసారా స్వాధీనం

మాచర్ల, జనవరి 29: మాచర్ల సెబ్ అధికారులు పట్టణంలోని రింగు రోడ్డు వద్ద దాడులు జరిపి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన దేవళ్ల భూలక్ష్మి అనే మహిళ రింగు రోడ్డు ప్రదేశంలో 10 లీటర్ల నాటుసారా కలిగి ఉండడాన్ని గుర్తించి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. న్యాయాధికారి ముందు హాజరుపరుచగా రిమాండ్ విధించినట్లు అధికారులు తెలిపారు.

తెలంగాణ మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు

రెంటచింతల, జనవరి 29: పోలీసులను చూసి ద్విచక్ర వాహనంపై పారితపోతున్న వ్యక్తిని వెంబడించి 104 క్వార్టర్ల తెలంగాణ మద్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి చెప్పారు. జెట్టిపాలెం గ్రామానికి చెందిన నిందితుడైన కట్టెబోయిన నరసింహారావును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

అనాధ మృతదేహానికి అంత్యక్రియలు

మాచర్ల, జనవరి 29: పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన నిర్లబోయిన చెన్నకేశవులు అనే యాచకుడు ఆదివారం మృతి చెందాడు. పోలీసులు అతని మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంబంధిత కుటుంబసభ్యులు, బంధువులు ఎవరూ రాకపోవడంతో స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మెట్టు గోవిందరెడ్డి ఆ మృతదేహానికి అంత్యక్రియలు జరిపారు.

విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు అందజేత

మాచర్ల, జనవరి 29: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం మదర్‌థెరిస్సా సేవాసమితి ఆధ్వర్యాన విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ శ్రీనివాసరావు తన తండ్రి బాలవెంకయ్య జ్ఞాపకార్థం కార్యక్రమం నిర్వహించారు.

వరికపూడిశెల ప్రాజెక్ట్ పనులు ప్రారంభించాలి

● సమాజ్‌వాదీ పార్టీ నేత యర్రగడ్డ నాగరాజు

మాచర్ల రూరల్, జనవరి 29: పల్నాటి ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వరికపూడిశెల ప్రాజెక్ట్ పనులు వెంటనే ప్రారంభించాలని సమాజ్‌వాదీ పార్టీ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రగడ్డ నాగరాజు మంగళవారం డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు రాజకీయ పార్టీల నేతలు వరికపూడిశెల ప్రాజెక్ట్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ప్రాజెక్ట్ నిర్మాణ పనులు ప్రారంభించకుంటే రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

రేపు పురపాలక సంఘం కౌన్సిల్ సమావేశం

మాచర్ల రూరల్, జనవరి 29: పురపాలక సంఘం కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఈనెల 31వ తేదీన పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు చైర్మన్ మాచర్ల చిన ఏసోబు తెలిపారు. ఈ ఏడాది సవరించిన సాధారణ నిధుల బడ్జెట్, వచ్చే ఏడాది బడ్జెట్ అంచనాల ఆమోదంపై సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు.

యూజీసీ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి

సత్తెనపల్లి, జనవరి 29: రిజర్వేషన్‌లపై యూజీసీ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని ఆదివాసి మేధావుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు అనుముల వంశీకృష్ణ అన్నారు. సోమవారం సత్తెనపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రిజర్వ్ పోస్టులకు తగిన అభ్యర్థులు అందుబాటులో లేకపోతే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ అభ్యర్థుల కోసం రిజర్వ్ చేసిన పోస్టులను డీ రిజర్వ్ చేయాలన్నారు. రిజర్వ్ చేసిన పోస్టులను వేరే వారితో భర్తీ చేయాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సూచించటం అవగాహన రాహిత్యం అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీలకు వ్యతిరేకమైన నిర్ణయం తీసుకుంటే కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా నష్ట పోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం యూజీసీ తీసుకున్న నిర్ణయంపై సమీక్షించి యూజీసీ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు న్యాయం చేయాలని ఆయన కేంద్రాన్ని కోరారు.

కన్నాపై దాడిని వ్యతిరేకిస్తూ నిరసన

రాజుపాలెం, జనవరి 29: కన్నా లక్ష్మీనారాయణపై తొండపిలో జరిగిన రాళ్ల దాడిని వ్యతిరేకిస్తూ సోమవారం రాజుపాలెంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం ముందు నిరసన తెలియజేసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుత్తా వెంకట్రావు, పార్లమెంటు కమిటీ కార్యదర్శి అంకాళ్ల ప్రభుదాసు, చిన్నబోయిన రాఘవయాదవ్, గంగవరపు రామ లక్ష్మణరావు, అంచుల నరసింహరావు, చొక్కా గాలయ్య, లేబాకుల బ్రహ్మయ్య, షేక్ అల్లబక్షు, శనగపూల వెంకయ్య తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేపై వ్యక్తి గత విమర్శలు మానుకోవాలి

బెల్లంకొండ, జనవరి 29: ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై వ్యక్తి గత విమర్శలు మానుకోవాలని బెల్లంకొండ మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. సోమవారం బెల్లంకొండలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నియోజకవర్గ నేత కంచేటి సాయి ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై ఆరోపణలు చేయటం మంచి పద్ధతి కాదన్నారు.

అచ్చంపేట, జనవరి 29: స్థానిక ఎమ్మెల్యేపై కంచేటి సాయిబాబు స్థాయి మరచి మాట్లాడటం, అవాకులు, చెవాకులు పేలవద్దని వైసీపీ నాయకులు సోమవారం విలేకరుల సమావేశంలో అన్నారు.

గుత్తికొండ బిళం వద్ద పచ్చదనానికి ప్రాధాన్యం

● కలెక్టర్ శివశంకర్ లోతేటి



పీవీ నాగేశ్వరరావును అభినందిస్తున్న కలెక్టర్

పిడుగురాళ్ల, జనవరి 29: పల్నాడు ప్రాంతంలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా ఉన్న గుత్తికొండబిళం వద్ద ఏకో పార్కును ఏర్పాటు చేసి పచ్చదనానికి ప్రాధాన్యం ఉండేలా చూస్తానని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ తెలిపారు. సోమవారం గుత్తికొండ గ్రామానికి చెందిన వల్లంబొట్ల వంశీకులు కొందరు నరసరావుపేటలో కలెక్టర్ శివశంకర్‌ను కలిసి గుత్తికొండబిళం వద్ద నగరవనాన్ని ఏర్పాటు చేయాలని కోరగా, పురపాలక సంఘం పరిధిలో 5కిలోమీటర్ల లోపు నగరవనం, దాటితే ఏకోపార్కు ఏర్పాటు చేయాల్సి ఉందని, గుత్తికొండ బిళం వద్ద ఏకోపార్కును ఏర్పాటు చేసి అధిక ప్రాధాన్యం ఇచ్చేలా రానున్న బడ్జెట్‌లో తగిన నిధులు మంజూరు చేయిస్తానని వల్లంబొట్ల వెంకట నాగేశ్వరరావు, తదితరులకు కలెక్టర్ హామీ ఇచ్చారు. రెడ్‌క్రాస్ సొసైటీకి రూ.11 వేల చెక్‌ను వల్లంబొట్ల వెంకట నాగేశ్వరరావు కలెక్టర్‌కు అందించగా కలెక్టర్ నాగేశ్వరరావును అభినందించారు. అనంతరం అటవీశాఖ అధికారి రామచంద్రరావును కూడా కలిసి గుత్తికొండ వద్ద పచ్చదనం కోసం చెట్లు పెంచే ప్రణాళిక చేయాలని కోరారు.

నాగిరెడ్డిపాలెంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం



బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

బెల్లంకొండ, జనవరి 29: మండలంలోని నాగిరెడ్డిపాలెంలో సోమవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని బెల్లంకొండ మండల కోర్ కమిటీ సభ్యులు వెన్నా సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. నాగిరెడ్డిపాలెంలో ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వెన్నా సీతారామిరెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు తిప్పిరెడ్డి కిచ్చారెడ్డి, తమ్మిశెట్టి రోశయ్య బుల్లెబ్బాయి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆత్మగౌరవం టీడీపీతోనే సాధ్యం

● తెలుగుమహిళా నాయకులు రాజేశ్వరి, సీత, వెంకటరమణలు



పిడుగురాళ్లలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీపై వివరిస్తున్న తెలుగుమహిళా పట్టణ అధ్యక్షురాలు చల్లగుండ్ల సీత తదితరులు

పిడుగురాళ్ల, జనవరి 29: వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని, నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్నా మహిళా మంత్రులు సైతం నోరు మెదపకపోవడం దారుణమని నరసరావుపేట పార్లమెంట్ తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి పాదర్తి రాజేశ్వరి, పట్టణ అధ్యక్షురాలు చల్లగుండ్ల సీత, పిడుగురాళ్ల రూరల్ అధ్యక్షురాలు పర్చూరి వెంకటరమణ తెలిపారు. సోమవారం పిడుగురాళ్లలోని 6వ వార్డు, బ్రాహ్మణపల్లిలో వేర్వేరుగా బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మహిళల ఆత్మగౌరవం పెరగాలంటే టీడీపీతోనే సాధ్యమవుతుందని, రేపటి ఎన్నికల్లో మహిళాశక్తి ఏమిటో చంద్రబాబుకు ఓటేసి నిరూపించాలని సూచించారు. భవిష్యత్తుకు గ్యారంటీ పథకాలను వివరిస్తూ ప్రతిఒక్కరికి గ్యారంటీ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గండికోట వెంకటేశ్వర్లు, షేక్ నాగుర్‌బి, కాటూరి కల్యాణి, కోమటినేని లక్ష్మీ, దియ్యా విజయ, వున్నం వాసవి, శారద, పార్వతి, చల్లా అంజమ్మ, బిజిలి వెంకటరావు, మన్నూరి సురేష్, అంకయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన మాచవరం జట్టు




విజేతలుగా నిలిచిన మాచవరం క్రికెట్ జట్టు

మాచవరం, జనవరి 29: గురజాలలో జరిగిన నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీల్లో మాచవరం మండలం జట్టు గెలుపొంది జిల్లా స్థాయిలో జరుగనున్న పోటీలకు ఎంపికైంది. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా గ్రామస్థాయిలో, మండల స్థాయిలో గెలిచి నియోజకవర్గస్థాయిలో కూడా గెలుపొంది జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు స్థానం సంపాదించింది. ఈ సందర్భంగా జిల్లా స్థాయికి ఎంపికైన క్రికెట్ జట్టుకు మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మీరెడ్డి, జడ్పీటీసీ శివ యాదవ్, ఉప ఎంపీపీ చింతపల్లి నన్నే, మాచవరం సర్పంచ్ రాగిడి నరేష్, మండల స్పోర్ట్స్ కన్వీనర్ నర్సిరెడ్డి, ఎంపీడీవో వరప్రసాద్, ఈవోపీఆర్‌డీ వెంగళరావులు టీమ్‌కు అభినందనలు తెలియజేశారు.

జయహో బీసీ కార్యక్రమానికి తరలి రావాలి

రెంటచింతల, జనవరి 29 : మాచర్లలో నేడు నిర్వహించబోయే జయహో బీసీ కార్యక్రమానికి భారీగా నేతలు కార్యకర్తలు తరలిరావాలని టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, శ్రీనివాసరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డిలు కోరారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మాచర్ల పట్టణం, రెంటచింతల మండలాలకు సంబంధించి ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డితో పాటు ఇతర నేతలు హాజరవుతారన్నారు.

ప్రమాద బాధితులకు సరుకులు, నగదు పంపిణీ



బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న స్నేహ హస్తాల ఫౌండేషన్ సభ్యులు

అచ్చంపేట, జనవరి 29: మండలంలోని తాడువాయి గ్రామ సమీపంలో రెండు రోజుల క్రితం టాటా ఏసీ బోల్తా పడి గాయపడి చికిత్స పొందుతున్న చెరుకుంపాలెం బాధితులకు సోమవారం స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందించారు. గాయాల పాలైన వారిలో సారెడ్డి బంగారమ్మ, బత్తుల శిరీష, ముద్రగడ్డ శివలీల, కారుమూరి లూర్దు, చల్లా భవానీలకు రూ.5వేలు నగదుతో పాటు నిత్యవసరాలు, స్వల్ప గాయాలైన మరో ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.2500లతో పాటు నిత్యావసరాలు, మొత్తం రూ.50 వేలు విలువైన వాటిని అందించారు. అందించిన వారిలో మన్నెం భద్రయ్య, వెంకటరావు, స్నేహ హస్తాల కో-ఆర్డినేటర్ కరీముల్లాబాబు, పెద్దలు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

మహిళల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, జనవరి 29: రాష్ట్రంలో మహిళల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాలులో వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళ పొదుపు సంఘాలకు వరుసగా నాలుగో సంవత్సరం ఆసరా నిధులను అందజేయడం జరిగిందన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో వరుసగా నాలుగో విడత 1205 స్వయం సహాయక గ్రూపులకు చెందిన 11.895 మంది డ్వాక్రా మహిళలకు రూ.9.04 కోట్లను అందజేయడం జరిగిందన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో నాలుగు విడతలుగా మొత్తం రూ.35.90 కోట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు, డైరెక్టర్లు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

రెడ్డిపాలెం పీహెచ్‌సీలో జిల్లా మలేరియా అధికారి తనిఖీ

రొంపిచర్ల, జనవరి 29: మండలంలోని రెడ్డిపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. వచ్చిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రేవతిబాయి, హెల్త్ ఎడ్యుకేటర్ సురేష్ కుమార్ ఉన్నారు.





చిత్రకారుడు జెస్టిస్

జెస్టిస్ గీసిన రైతుల ఆక్రందన చిత్రం

చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్‌కు ప్రథమ బహుమతి

వినుకొండ, జనవరి 29: ఇటీవల విజయవాడలో ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్తంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉమ్మడిగా నిర్వహించిన చిత్రకళాపోటీల్లో వినుకొండ పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్‌కు ప్రథమ బహుమతి లభించింది. మిచౌంగ్ తుఫాన్ తాకిడికి పంటలు దెబ్బతిన్న రైతుల ఆవేదనను సూచిస్తూ రైతుల ఆక్రందన అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ఆయనకు ప్రథమ బహుమతి లభించింది. ఫిబ్రవరిలో నిర్వాహకులు బహుమతి అందజేయనున్నట్లు జెస్టిస్ వివరించారు. ఎన్నో జాతీయ, అంతర్జాతీయ బహుమతులు అందుకున్న జెస్టిస్‌ను మిత్రులు, రాజకీయ నాయకులు, కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మాజీమంత్రి కన్నాపై రాళ్ళదాడి పిరికిపంద చర్య

● టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు

శావల్యాపురం, జనవరి 29: మాజీమంత్రి, టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక వైసీపీ రౌడీమూకలు అయనపై రాళ్ళదాడికి ప్రయత్నించడం పిరికిపంద చర్యని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. శావల్యాపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్తెనపల్లి నియోజకవర్గం తొండపిలో బాబూ ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహిస్తున్న మాజీమంత్రి కన్నాపై రాష్ట్రమంత్రి అంబటి రాంబాబు కిరాయి రౌడీలతో లైట్లు ఆపించి రాళ్ళదాడికి పాల్పడడం, పోలీసులు అక్కడే ఉండి కూడా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వైసీపీ ప్రభుత్వ నిరంకుశత్వానికి, బానిసత్వానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో సుదీర్ఘకాలం మంత్రిగా చేసిన కన్నాకు ప్రభుత్వ సెక్యూరిటీని కూడా తీసివేశారని, ఎన్నో రాజకీయ ఒడిదుడుకులు ఎదుర్కొన్న కన్నా జీవితంలో ఇటువంటి ఘటనలను ఎన్నింటినో చూశారని, రాబోయే రోజుల్లో వైసీపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. వైసీపీప్రభుత్వం అధికారంలోకొచ్చాక రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా నశించాయని, రానున్న ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వాన్ని కూకటి వేళ్ళతో సహా పెకిలించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

ఘనంగా నూతన విద్యార్థుల ఆహ్వాన వేడుకలు



ముఖ్యఅతిథి డాక్టర్ కే వరలక్ష్మిదేవిని సత్కరిస్తున్న కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 29: స్థానిక ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ నూతన విద్యార్థుల ఆహ్వాన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్‌కే విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ కే వరలక్ష్మిదేవి మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో భారతదేశ ఫార్మారంగంలో ప్రథమస్థానంలో రాణిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఫార్మారంగంలో ఉన్న మెరుగైన అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. గౌరవ అతిథి కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఏఎంరెడ్డి విద్యాసంస్థలు అన్ని రకాల సదుపాయాలతో కళాశాలను అభివృద్ధిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవ్‌భూషన్‌రావు, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్‌ప్రసాద్‌రెడ్డి, డిప్లొమో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ ఎం.లక్ష్మి సురేఖ, డాక్టర్ జీ కిరణ్, డాక్టర్ మొహమ్మద్ సయ్యద్ ఫిరోజ్, సునీత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్పీని కలసిన ముప్పాళ్ళ ఎస్ఐ హజరత్తయ్య

నరసరావుపేట లీగల్, జనవరి 29: ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నరసరావుపేట రూరల్ స్టేషన్ నుంచి ముప్పాళ్ళకు బదిలీ అయిన ఎస్ఐ హజరత్తయ్య సోమవారం పల్నాడు జిల్లా ఎస్పీ వై రవి శంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం పాటు పడాలన్నారు. సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలన్నారు. ప్రజల రక్షణ, భద్రత కోసం కృషి చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలని, ఆయన సూచించారు.

అవార్డు గ్రహీతలకు అభినందనలు



మున్సిపల్ కమిషనర్‌ను అభినందిస్తున్న సభ్యులు

వినుకొండటౌన్, జనవరి 29: రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అవార్డులు పొందిన ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, పట్టణ సీఐ సాంబశివరావును లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం అన్నదాన ప్రధాన సేవకుడు జాజుల మాల్యాద్రి, రెడ్‌క్రాస్ సొసైటీ, వాసవిక్లబ్ సభ్యులు సంయుక్తంగా కలిసి దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఆయా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గోపిరెడ్డి అవినీతిపై ఆధారాలున్నాయి

● స్పందనలో ఫిర్యాదుచేసిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవిందబాబు



కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 29: ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేసిన అవినీతిపై ఆధారాలు ఉన్నాయని, వాటిని కలెక్టర్‌కు ఆందజేసినట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు వెల్లడించారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్పందన హాలులో సోమవారం జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన కలెక్టర్ శివశంకర్ లోతేటిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఫిర్యాదులను కలెక్టర్ శివశంకర్ లోతేటి, జాయింట్ కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్, డీఆర్‌వో కే వినాయకం స్వీకరించారు. స్పందనకు జిల్లా అధికారులంతా హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన అర్జీదారులలో 206 ఫిర్యాదులు అందినట్లు కలెక్టరేట్ సిబ్బంది తెలిపారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ మండల ప్రత్యేక అధికారులు కుల గణన సర్వేపై దృష్టి సారించి త్వరితగతిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. అంతేకాకుండా నవరత్నాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికి ఇళ్ళ పట్టాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మండల ప్రత్యేక అధికారులు దృష్టిపెట్టి రానున్న ఐదు రోజులలో పూర్తిఅయ్యేలా చూడాలని, పల్నాడు జిల్లాను రాష్ట్రంలో ముందు వరుసలో ఉంచాలన్నారు.

స్పందనలో ఫిర్యాదు చేసిన అనంతరం అరవిందబాబు మీడియాతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే చేసే దుర్మార్గాలు, అవినీతిపై మీడియాలో చెప్పి, ఆధారాలు చూపిస్తామని చెప్పామన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఉప్పలపాడు వద్ద సాయి బాలాజీ పేరుతో 200 ఎకరాల వెంచర్ షేక్ కార్పొరేషన్ చైర్మన్ పేరుతో వేశారని చెప్పారు. 200 ఎకరాల వెంచరులో 46ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. దీనిని కలెక్టర్ దృష్టికి తెచ్చామని, దీనిపై ఎందుకు భూసర్వే నిర్వహించాలని అడిగామన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి కనుసన్నలలోనే గుట్కా మాఫియా జరుగుతుందన్నారు. నకరికల్లు వద్ద రూ.4 కోట్లు నుంచి రూ.5కోట్లవరకు గుట్కా పట్టుకున్నారని, ఆ పటుబడిన వ్యక్తి కూడా ఎమ్మెల్యే అనుచరుడన్నారు. వినుకొండ రోడ్డులో అక్రమంగా నిల్వఉంచిన రెండువేల క్వింటాలు బియ్యం పట్టుకున్నారని, ఆ బియ్యం వ్యాపారం చేస్తున్న వ్యక్తికూడా ఎమ్మెల్యే అనుచరుడన్నారు. ఎమ్మెల్యేకు ధైర్యం ఉంటే ఒక తేదీ నిర్ణయించి దీనిపై చర్చకు రావాలని, చర్చ సీటీ కేబుల్‌లో, కలెక్టర్ వద్ద, లేదా కోటప్పకొండ వద్దనైనా పెట్టాలని అన్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కడియం కోటిసుబ్బారావు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పులిమి వెంకటరామిరెడ్డి, కడియాల తాండవకృష్ణ, టీడీపీ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ మాబు, టీడీపీ శ్రేణులు ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలు సత్వరం పరిష్కరించాలి

రాష్ట్రప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో కలెక్టర్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ తిరిగి యథావిధిగా పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం సుబ్బారావు, కార్యదర్శి సీసీ ఆదెయ్య, కోశాధికారి గుమ్మడి రాఘవయ్య నాయకులు పాల్గొన్నారు.

ఒక్క సంక్షేమ పథకం కూడా లేదు

● కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

నరసరావుపేట టౌన్, జనవరి 29: వైసీపీ ప్రభుత్వం వచ్చి నాలుగున్నర సంవత్సరాలు అయినా రైతులకు ఒక్క సంక్షేమ పథకం కూడా ప్రవేశపెట్టలేదని కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అన్నారు. సోమవారం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిగురుపాటి కుమారస్వామి మాట్లాడుతూ నాడు రాష్ట్రంలో 400మండలాలలో కరువు తాండవిస్తుంటే 103మండలాలు మాత్రమే ప్రకటించారని అన్నారు. దీనికి నిరసనగా అనేకసార్లు నిరసనలు, ధర్నాలు చేసినా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. రైతు వ్యతిరేక ప్రభుత్వం దిగిపోయే వరకు కిసాన్‌మోర్చా ఉద్యమిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నెల్లూరి ఈశ్వర్ రంజిత్, రంగిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు,

సర్వీసు రోడ్డుకు గోడ: రైతులకు ఇబ్బందులు

ప్రభుత్వం నిర్మిస్తున్న చిలకలూరిపేట బైపాస్ రోడ్డుకు ఇరువైపులా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తున్నారని నాదెండ్ల మండలం గణపవరం రైతులు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు తెలియజేశారు. తిమ్మాపురం నుంచి బొప్పూడి వరకు వేస్తున్నవంటి సర్వీసురోడ్డుకు సపోర్టు గోడ నిర్మిస్తున్నారన్నారు. దీంతో రైతులకు పొలాలకు వెళ్ళడానికి దారిలేకుండా పోతుందని చెప్పారు. కాగా నరసరావుపేట మండలం జొన్నలగడ్డకు చెందిన నల్లపాటి రామారావుకు పంట భూములు రీసర్వేలో 13సెంట్లు తగ్గించి నోటీసులు ఇచ్చారని ఫిర్యాదు చేశారు. రీ సర్వే నిర్వహించి రికార్డు ప్రకారం భూమి అప్పగించాలని, సంబంధిత గ్రామ సర్వేయరుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

దళిత యువకుడిపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గురజాల మండలం మాడుగులలో దళిత యువకుడిపై దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని ఎంఆర్‌పీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతిరాల మీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మీరయ్య మాదిగ మాట్లాడుతూ తగుచర్యలు తీసుకోకపోతే రాష్ట్ర ఎంఆర్‌పీఎస్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు టీఎం రమేష్‌మాదిగ, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషనర్ మూరమూరి విక్టర్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్ళి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పేరుపోగు ప్రసాదరావు, సాతులూరి మార్కు, పేరుపోగు యాకోబు, సైమన్, యోహాన్,కోటయ్య, యేసోబు, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వచ్చినప్పటి నుంచి అరాచకాలు పెరిగిపోయాయి

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు



నరసరావుపేట టౌన్, జనవరి 29: వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పల్నాడు జిల్లాలో అరాచకాలు పెరిగిపోయాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. సోమవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ కొంతమంది పోలీసుల సహకారంతో ఏవిధంగా చేశారో చూశామన్నారు. కొంతమంది పోలీసు వాళ్ళు అతిఉత్సాహం చూపిస్తున్నారని, డాక్టర్ గోపిరెడ్డి సంపాదించినా, పల్నాడు జిల్లా ఎమ్మెల్యేలు సంపాదించినా వాటాలు ఇస్తారనుకుంటున్నారేమోకాని పోలీసులకు వాటా ఇవ్వరన్నారు. పోలీసులను చరిత్రహీనులుగా నిలబెడతారని హెచ్చరించారు. మాచర్లలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మానందరెడ్డి అనుచరుడిని ఆత్మహత్యకు పురిగొల్పేవిధంగా పోలీసులు వ్యవహరించారన్నారు. ప్రజలను కాపాడాల్సిన పోలీసులు ఆ విధంగా చేయడం సరికాదన్నారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ సత్తెనపల్లి నియోజకవర్గంలోని తొండపిలో బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహిస్తుంటే మంత్రి అంబటి రాంబాబు రాళ్లతో దాడిచేయించడం దారుణం అన్నారు. మాజీ మంత్రికే రక్షణలేకపోతే ప్రజలను ఏవిధంగా రక్షిస్తారని, డీఎస్పీ ఉన్నా అలా జరగడం దారుణం అన్నారు. రైతులు సాగునీరు లేక పెట్టిన పెట్టుబడులు రావని బాధపడుతుంటే జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు వాళ్లను పట్టించుకోకుండా తెలుగుదేశం వాళ్ళు ఎవరు బాగా పనిచేస్తున్నారో వలంటీర్ల ద్వారా తెలుసుకొని వేధిస్తున్నారని విమర్శించారు. వలంటీర్లు కేవలం రూ.5వేల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టడం సరికాదన్నారు. నిజాయితీగా పనిచేసిన వలంటీర్లకు చంద్రబాబు నాయుడు వచ్చినా ఇబ్బంది ఉండదన్నారు, వలంటీర్లు రాష్ట్ర శ్రేయస్సుకోసం పనిచేయాలని కోరారు. రైతుల ఇబ్బందులు తెలియజేయడం కోసం కలెక్టర్ కార్యాలయంకు వస్తే లాఠీచార్జి చేయడం సరికాదన్నారు. సమావేశంలో తెలుగురైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్ధనబాబు తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువు కమిటీకి ఎన్నిక జరపండి

● చేపల చెరువు సొసైటీ మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఈపూరు, జనవరి 29: చేపల చెరువు సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలని సొసైటీ మాజీ అధ్యక్షుడు ఆత్మకూరి వెంకటేశ్వర్లు అన్నారు. ఈపూరు రాపర్ల వారి చేపల చెరువు సొసైటీకి ఎన్నికలు నిర్వహించకపోవడంతో అందులోని సభ్యులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు రాజకీయాల వలన చెరువులో చేపల పెంపకం నిలిచిపోయిందన్నారు. చేపల చెరువు సొసైటీలో మొత్తం 62మంది సభ్యులు ఉండగా 50 మంది టీడీపీ సానుభూతి పరులేనన్నారు. ఓటమి భయంతోనే సొసైటీకి ఎన్నికలు జరగకుండా అధికారపార్టీ వాళ్లు అడ్డుంకుంటున్నారన్నారు. చెరువులో పెంచే చేపలపై జీవనం సాగిస్తున్న 62 కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వచ్చిందన్నారు. ఈమేరకు సోమవారం నరసరావుపేటలో కలెక్టర్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

సాక్షిగా కోర్టుకు వచ్చిన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

వినుకొండటౌన్, జనవరి 29: నాడు డాక్టర్‌గా ఉన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఒక కేసులో సాక్షిగా సోమవారం హాజరయ్యారు. వివరాలను పరిశీలిస్తే... వినుకొండ మండలంలోని పెదకంచర్ల గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఓ వ్యక్తికి గాయాలు తగలడంతో ఆ వ్యక్తికి 2016వ సంవత్సరంలో డాక్టర్‌గా వైద్యసేవలు అందించిన కేసులో గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వినుకొండ కోర్టులో సాక్షిగా హాజరుకావాల్సి వచ్చింది. వినుకొండకు వచ్చిన ఆయనను వైసీపీకి చెందిన నాయకులు పెద్దసంఖ్యలో కలిశారు.



మర్రిచెట్టుపాలెంలో మేనిఫెస్టో పత్రాలను అందజేస్తున్న అరవింద బాబు, గోనుగుంట్ల కోటేశ్వరరావు

మర్రిచెట్టుపాలెంలో బాబు ష్యూరిటీపై ప్రచారం

రొంపిచర్ల, జనవరి 29: నరసరావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేసిన అభివృద్ధి శూన్యమని టీడీపీ ఇన్‌చార్జ్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. మండలంలోని మర్రిచెట్టుపాలెంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలసి ఆయన ఇంటింటికి తిరిగి మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని తెలిపారు. అభివృద్ధి పేరిట నిధులను ఎమ్మెల్యే దోచుకుంటున్నారని పేర్కొన్నారు. గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని నరసరావుపేటలో ఓడించాలని పిలుపునిచ్చారు. సహజ వనరులను దోచుకుంటున్నారని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే నరసరావుపేటలో అభివృద్ధిచేసి చూపిస్తామని పేర్కొన్నారు. గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబునాయుడు చేపడుతున్న రా కదలి రా కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తుందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పదవీ బాధ్యతలు చేపట్టబోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌పై నిరసన

వినుకొండ టౌన్, జనవరి 29: 24గజాల స్థలం కోసం ఓ వ్యక్తి వినుకొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానిక స్టాంప్ వెండర్లు తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ పట్టణం శాలివాహననగర్‌కు చెందిన పిరంపల్లి శ్రీనివాసరావు, పిరంపల్లి మల్లికార్జునరావులు అన్నదమ్ములు. పెద్దల నుంచి సంక్రమించిన ఆస్తిని అన్న శ్రీనివాసరావు ముందుగా కుటుంబసభ్యుల వివరాలు దాఖలాలు చేయకుండా తన వాట 3 సెంట్లతో పాటు అదనంగా 24 గజాల స్థలాన్ని తన కుమారుడి పేరుపై 2023లో రిజిస్టర్ చేయించుకున్నాడు. ఇదే తరహాలో మిగిలిన తన వాటాగా వచ్చిన 3సెంట్ల స్థలాన్ని తమ దగ్గర ఉన్న ఆధారాలతో రిజిస్టర్ చేయాలని వినుకొండ సబ్ రిజిస్ట్రార్ నర్రా హరికృష్ణకు తమ్ముడు మల్లికార్జునరావు డాక్యుమెంట్ అందజేశాడు. అన్న చేయించుకున్న 24 గజాలు పోను మిగిలిన స్థలాన్ని రిజిస్టర్ చేస్తానని రిజిస్ట్రార్ చెప్పడంతో మల్లికార్జునరావు కుటుంబసభ్యులు ససేమిరా అన్నారు. డాక్యుమెంట్ వివరాలు లేకుండా తన అన్నకు ఎక్కువ స్థలాన్ని ఎలా రిజిస్టర్ చేశారంటూ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. సబ్ రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వచ్చి వారిని అక్కడి నుంచి పంపివేశారు. ఈ విషయంపై సబ్‌రిజిస్ట్రార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

ఆటో ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

నాదెండ్ల, జనవరి 29: ఆటో ఢీకొన్న సంఘటనలో ఇరువురు గొర్రెల కాపరులు తీవ్రంగా గాయ పడిన సంఘటన మండలంలోని గణపవరం గ్రామంలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం గణపవరం గ్రామానికి చెందిన మన్నెం చిన రాఘవ, అచ్చి రమణలు గొర్రెలను మేపుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. మధ్యాహ్న సమయంలో భోజనం చేసేందుకు ఇద్దరు ఇంటికి వచ్చారు. మరొకరికి భోజనం తీసుకొని ద్విచక్ర వాహనం పై పొలంలో ఉన్న గొర్రెల వద్దకు వెళ్తుండగా గ్రామ పరిధిలోని ఐసీఎం కంపెనీ గేటు సమీపంలో నాదెండ్ల వైపు నుంచి వచ్చే ఆటో వేగంగా వచ్చి వీరి వాహనాన్ని ఢీకొట్టింది. గాయ పడ్డ వీరిని చికిత్స కోసం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అగ్నిగుండాలలో సచివాలయం, ఆర్‌బీకే ప్రారంభించిన ఎమ్మెల్యే బొల్లా

అగ్నిగుండాల (ఈపూరు) జనవరి 29: మండలంలోని అగ్నిగుండాల గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాల నూతన భవనాలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సోమవారం ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఏపీ సుధాకర్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల నిర్వహణపై అవగాహన

యడ్లపాడు, జనవరి 29: జలజీవన్ మిషన్ కింద మంజూరైన పనుల నిర్వహణపై గ్రామ జలసంఘం కమిటీల సభ్యులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొని అవగాహన కల్పించారు. జలజీవన్ మిషన్ కింద మండలంలో 18 పనులు మంజూరు కాగా 8పనులు నిర్వహించేందుకు కాంట్రాక్టర్లు టెండర్లు వేశారని, అందులో మూడు గ్రామాల్లో చేపట్టిన పనులు పూర్తయ్యాయన్నారు. టెండర్లు వేయని గ్రామాల్లో కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ సిస్టం ద్వారా పనులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వరూధిని, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి: ఎస్పీ

నరసరావుపేట లీగల్, జనవరి 29: స్పందన ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని సోమవారం పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ఎస్పీ వై రవి శంకర్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొని ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. యడ్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలోని సొలస గ్రామానికి చెందిన మహిళ అదే గ్రామానికి చెందిన కోటేశ్వరరావు అనే వ్యక్తి వద్ద ఆరు సెంట్ల స్థలం కొనుగోలు చేసిందని, అందులో ఇళ్ళు కట్టుకుందామని చూడగా సదరు స్థలం అమ్మిన వ్యక్తి ఇంకొకరికి కూడా ఆ స్థలం అమ్మి, డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడని, తగు న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. మాచర్ల మండలం లచ్చంబావి గ్రామానికి కంబాల చిన వెంకయ్య అనే వ్యక్తి వారు పండించిన మిర్చి పంటను గుంటూరుకు చెందిన బత్తుల నాగేశ్వరరావు అనే మిర్చి వ్యాపారికి అమ్మగా, రూ.13 లక్షలు డబ్బులు ఇచ్చి, మిగిలిన 22 లక్షలు ఇస్తానని ఇవ్వకుండా మోసం చేశాడని, తనతో పాటు మరికొందరిని కూడా ఈ విధంగా మోసగించాడని, తగు న్యాయం చేయాలని ఎస్పీని ఆశ్రయించాడు. కార్యక్రమంలో ఏఎస్పీలు రాఘవేంద్ర, రామచంద్రరరాజు, డీఎస్పీ షర్ఫుద్దీన్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



కళ్యాణి సెంటర్‌లో ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

చిలకలూరిపేట అర్బన్, జనవరి 29: పట్టణంలోని కళ్యాణి సెంటర్‌లో కొనసాగుతున్న అన్నదానానికి సోమవారం కొమ్మారెడ్డి కొండయ్య జ్ఞాపకార్థం మనువడు డాక్టర్ దుశ్యాంత్ కుమార్ సహకారం అందించారు. 642మంది నిరుపేదలకు, వలస కూలీలకు భోజన సదుపాయం ఏర్పాటుచేశారు. దుశ్యాంత్‌కుమార్ కుటుంబ సభ్యులు అన్నదానం ప్రారంభించగా టీడీపీ నాయకులు షేక్ కరీం, సుభానీ, ఖాజావలి, అన్వర్, ఉమర్‌లు కార్యక్రమంలో పాల్గొని స్వచ్ఛందంగా సేవలందించారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థిక సాయం



ఆర్థికసాయం చేస్తున్న టీడీపీ నాయకులు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 29: మండలంలోని కోమటినేనివారిపాలెం గ్రామానికి చెందిన వడియాల పుల్లారావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. విషయం తెలిసిన మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఇటీవల వారిని పరామర్శించారు. వారికి ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.10వేలు ఆర్థికసాయాన్ని టీడీపీ నాయకులు అందించారు. కార్యక్రమంలో నెల్లూరి సదాశివరావు, షేక్ కరిముల్లా, జువ్వాజి మదన్ మోహన్, అంబటి సోంబాబు, గుర్రం నాగపూర్ణచంద్రరావు, ఉమా మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజేష్ నాయుడే వైసీపీ అభ్యర్థి

● చిలకలూరిపేటలో స్పష్టంచేసిన విజయసాయిరెడ్డి



వైసీపీ సామాజిక సాధికారిక యాత్రలో సభలో పాల్గొన్న విజయ సాయిరెడ్డి, మర్రి రాజశేఖర్, రజిని, మల్లెల రాజేష్ నాయుడు తదితరులు



సభలో దర్శన మిచ్చిన ఖాళీ కుర్చీలు

చిలకలూరిపేట, జనవరి 29: రానున్న ఎన్నికల్లో చిలకలూరిపేట వైసీపీ అభ్యర్థి మల్లెల రాజేష్ నాయుడేనని వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, ఎంపీ విజయ సాయిరెడ్డి సోమవారం ఇక్కడ స్పష్టం చేశారు. వైసీపీ సామాజిక సాధికార యాత్రలో పాల్గొనేందుకై ఆయన ఇక్కడకు వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాజేష్ నాయుడును మార్చి వేరొక అభ్యర్థిని రంగంలోకి దింపుతారంటూ జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ప్రకటించారు. రాజేష్ నాయుడును ఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. మంత్రి విడదల రజిని మాట్లాడుతూ చిలకలూరిపేటలో గత నాలుగున్నర సంవత్సరాల్లో రూ 2వేల కోట్లతో అభివృద్ధి పనులు, రూ వెయ్యి కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతికి వైసీపీ కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో రాజేష్ నాయుడును గెలిపించాలని ఆయన కోరారు. మీడియా సమావేశం అనంతరం కొత్త మార్కెట్ యార్డు వద్ద నుంచి సాధికార యాత్ర సభ జరిగే కళా మందిర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కళా మందిర్ సెంటర్‌లో సినిమా సెట్టింగ్‌ను తలపించే విధంగా భారీ వేదికతో పాటు ఇతర ఏర్పాట్లు కూడా భారీగానే చేశారు. జన సమీకరణ కూడా బాగానే జరిగింది. ఐతే నేతలు ప్రసంగిస్తున్న సమయంలోనే జనం సభ నుంచి వెళ్లిపోయారు. సభ ప్రారంభమైన కొంతసేపటి తరువాత ఖాళీ కుర్చీలు అక్కడ దర్శనమిచ్చాయి. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు కుంభా రవిబాబు, చుక్కా ఏసురత్నం, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

సామాజిక యాత్ర కోసం భారీ వృక్షాల నరికివేత

వైసీపీ సామాజిక సాధికార యాత్ర సందర్భంగా నాయకులు పయనించే బస్సు మార్గంలో ఐదు, ఆరు దశాబ్దాల క్రితం నుంచి ఉన్న భారీ వృక్షాలను యంత్రాలతో హడావుడిగా ఆదివారం నరికివేశారు. పట్టణంలోని చౌత్ర సెంటర్, రూరల్ పోలీసు స్టేషన్ మధ్య పెద్ద వేప చెట్లను యంత్రాలతో హడావుడిగా కొట్టి వేశారు. కళా మందిర్ సెంటర్ నుంచి గుంటూరు, విజయవాడ వైపు వెళ్ళే ఆర్టీసీ బస్సులు బయలు దేరతాయి. కాని సభ కోసం చుట్టూ భారీ కేడ్లు ఏర్పాటు చేయటంతో ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆ బస్సులను నడిపారు. దీంతో ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పెదనందిపాడు, పూనూరు బస్సుల విషయంలో కూడా ఇలాగే జరిగింది. దీనికి తోడు కళా మందిర్ సెంటర్ యావత్తు సాధికార సామాజిక యాత్ర ఫ్లెక్సీలతో నింపి వేశారు. దీంతో ఆ ఫ్లెక్సీల వెనుక ఉన్న దుకాణాల వారి వ్యాపారాలు పడి పోయాయి. సాధికార యాత్ర సందర్భంగా వందల సంఖ్యలో పోలీసులను మోహరించారు.

వినుకొండ ఫొటోగ్రాఫర్స్‌కు శివనంది అవార్డులు



అవార్డులు అందుకున్న ఫొటోగ్రాఫర్స్ వి.బ్రహ్మయ్య, కె.సుబ్బారావు

వినుకొండ, జనవరి 29: ఫొటోగ్రఫీ రంగంలో ప్రతిభ కనపరిచిన వినుకొండ పట్టణానికి చెందిన వంగపల్లి బ్రహ్మయ్య, కేశానుపల్లి సుబ్బారావులకు శ్రీకాళహస్తిలోని ఎస్‌వీఎస్ కల్యాణ మండపంలో జరిగిన ప్రైడ్ ఇండియా కల్చర్స్ నృత్యోత్సం కార్యక్రమంలో శివనంది అవార్డులు అందజేసి అభినందించినట్లు అవార్డు గ్రహీతలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.